ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



పల్నాడు జిల్లా వార్తలు

5

బుధవారం 4 జూన్ 2025



ఉష్ణోగ్రత (అంచనా)

4-6-2025	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	39	28
తెనాలి	39	28
నరసరావుపేట	39	28
బాపట్ల	39	29
రెంటచింతల	40	29
చీరాల	39	29



రేపు వనమహోత్సవం

- అనంతవరానికి రానున్న చంద్రబాబు, పవన్‌కల్యాణ్
- పార్కులో రెండు వేల మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు
- ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్, కలెక్టర్ భార్గవతేజ

తుళ్లూరు (అనంతవరం), జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకొని రాజధాని అమరావతి పరిధిలోని అనంతవరంలో గురువారం నిర్వహించే వనమహోత్సవానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో 20 ఎకరాల్లో ఏర్పాటు చేసిన పార్కులో రెండు వేల మొక్కలు నాటనున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. దీంతో అనంతవరం ఎన్-15, ఈ-6 రోడ్డు జంక్షన్‌లోని పార్కులో ఏడీసీ, సీఆర్‌డీఏ, అటవీశాఖ అధికారులు భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. వెంకటపాలెం సెంట్రల్ పార్కు, పేరేచర్ల నర్సరీల నుంచి అనంతవరానికి మొక్కలను తెప్పిస్తున్నారు. ఆయా ఏర్పాట్లను మంగళవారం తాడికొండ ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్, ఇన్‌చార్జ్ కలెక్టర్ భార్గవతేజ పరిశీలించారు.



మొక్కలు నాటే ప్రాంతంలో పనులు చేస్తున్న యంత్రాలు

జీడీసీసీబీకి త్వరలో సభాసంఘం

- రికార్డులు అందుబాటులో ఉంచాలని ఆదేశం
- విచారణకు రానుండటంతో అక్రమార్కుల గుండెల్లో రైళ్లు

గుంటూరు సిటీ, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (జీడీసీసీబీ) అక్రమాలపై విచారణకు సభా సంఘం త్వరలో రానున్నది. రికార్డులు అందుబాటులో ఉంచాలని బ్యాంకు అధికారులకు సమాచారం కూడా అందింది. వారం, పది రోజులలోపే సభా సంఘం వచ్చే అవకాశం ఉందని ఉన్నతస్థాయి అధికారులు కూడా ధ్రువీకరించారు. వైసీపీ హయాంలో ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా జీడీసీసీబీలో బోలెడు అక్రమాలు జరిగాయి. 42 జీడీసీసీ బ్యాంకు శాఖలు, 167 సహకార సంఘాల్లో సుమారు రూ.420 కోట్లు గల్లంతైనట్లు ఆరో పణలు ఉన్నాయి. 17 సహకార సంఘాల్లో జరిగిన అవినీతిపై పోలీసులు కేసులు కూడా నమోదు చేశారు. వీటిపై విచారణ చేపట్టాలని సహకార అధికారులు ఉన్నత అధికారులకు లేఖలు రాసినా ప్రయోజనం లేకుండా పోయింది. జీడీసీసీ అక్రమాలపై సభా సంఘం వేయాలని గత అసెంబ్లీ సమావేశాల్లో పొన్నూరు, ప్రత్తిపాడు ఎమ్మెల్యేలు ధూళిపాళ్ల నరేంద్ర, బూర్ల రామాంజనేయులు డిమాండ్ చేశారు. దీనిపై స్పందించిన ప్రభుత్వం సభా సంఘం వేస్తున్నట్లు మార్చి 20న ప్రకటించింది. ఈ సభా సంఘం ప్రస్తుతం విచారణకు రానుండటంతో అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి.



క్రిమినల్ కేసులకు ఉపక్రమించిన సహకార శాఖ

ఇదిలా ఉంటే సహకార శాఖ కూడా జీడీసీసీ అక్రమార్కులపై చర్యలకు ఉపక్రమించింది. 17 సహకార సంఘాల్లో అక్రమాలకు పాల్పడిన వారిపై పోలీసులకు ఫిర్యాదు చేయటం కలకలం రేపుతుంది. అప్పట్లో వైసీపీ నేతల అడుగులకు మడుగులు ఒత్తిన కొందరు ఇప్పుడు ఏమి తెలియదు అన్నట్లుగా ఉద్యమాలు చేస్తుండటం చర్చకు దారితీస్తుంది.



గురుకుల స్కూల్ భవనం

గిరిజన విద్యపై చోద్యం

ఈ ఏడాదీ ప్రారంభం కాని గురుకులం

- మరో వారంలో విద్యా సంవత్సరం ప్రారంభం
- రూ.8.20 కోట్లతో పెదతురకపాలెంలో నిర్మాణం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

మరో వారంలో విద్యా సంవత్సరం ప్రారంభం కానున్నది. నరసరావుపేట మండలం పెదతురకపాలెం వద్ద రూ.8.20 కోట్లతో నిర్మించిన గిరిజన గురుకులాన్ని ప్రారంభించలేదు. గిరిజన విద్యార్థులకు గురుకుల విద్య అందించేందుకు అన్ని వసతులతో ఇక్కడ భవనాలను నిర్మించారు. అయితే ఈ విద్యా సంవత్సరంలో ఆయా భవనాలను ప్రారంభించి గిరిజన విద్యార్థులకు గురుకుల విద్య అందించడంలో గిరిజన సంక్షేమ శాఖ చోద్యం చూస్తోంది. ఈ నేపథ్యంలో వందలాది మంది గిరిజన బాలురు గురుకుల విద్యకు దూరమయ్యే పరిస్థితులు నెలకొంటున్నా అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తున్నాయి. వైసీపీ హయాంలో నిధుల కొరతతో ఏళ్ల తరబడి నిర్మాణం నిలిచిపోయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిధులు విడుదల చేయడంతో శరవేగంగా భవనాల నిర్మాణం జరిగింది. ఈ స్కూల్‌కు 250 సీట్లను కేటాయించారు. అయితే అడ్మిషన్లు నిర్వహించేందుకు నేటి వరకు అధికారులు చర్యలు చేపట్టలేదు. ఈ ప్రాంతంలోని గిరిజన బాలికల స్కూల్‌ను గత విద్యా సంవత్సరంలో ప్రారంభించారు.



వసతి గృహాలు

ట్రేడర్ల ఉచ్చులో బర్లీ రైతు!



ప్రభుత్వ ఆదేశాలు భేఖాతరు..



తీసికట్టు ధరలకు పర్చూరులో పొగాకు కొనుగోలు చేస్తున్న కంపెనీలు

- తక్కువ ధరలకు రైతుల నుంచి కొనుగోలు
- బర్లీ పొగాకు కొనుగోళ్లపై కంపెనీలది అదే వైఖరి
- అయినకాడికి అమ్ముకుంటున్న కర్షకులు
- ప్రభుత్వ విభాగాల పర్యవేక్షణ కరువు
- రెండో వారంలో రంగంలోకి మార్క్‌ఫెడ్

(బాపట్ల, పర్చూరు- ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం క్షేత్రస్థాయిలో జరుగుతున్న పొగాకు కొనుగోళ్లు వ్యవసాయశాఖ మంత్రి ఆదేశాలను ప్రతిబింబించక పోగా ట్రేడర్స్ ఉచ్చులో చిక్కుకుని బర్లీ రైతు విలవిల్లాడిపోతున్నాడు. ఈ పదిరోజుల వ్యవధిలోనే దాదాపు 60 వేల క్వింటాలు బర్లీ పొగాకు ట్రేడర్స్ కొనుగోలు చేసినట్లు క్షేత్రస్థాయి గణాంకాలు ధ్రువీకరిస్తున్నాయి. రూ.3 వేలు మొదలుకుని గరిష్ఠంగా రూ.8 వేలు ధర చెల్లించే ఈ కొనుగోళ్లు జరిగినట్లు రైతులు చెబుతున్నారు. వ్యవసాయశాఖ మంత్రి దాదాపు 20 కంపెనీలతో సమావేశం నిర్వహిస్తే 15 కంపెనీలు ఇప్పటికీ ఫీల్డ్ లెవెల్లో ఒక్క క్వింటా కొన్న దాఖలాలు లేవు. జీపీఐ, ఐటీసీ, కార్డెల్ టుబాకోస్ వంటివి మాత్రం అరకొరగా కొనుగోళ్లు జరుపుతున్నా ప్రభుత్వం నిర్దేశించిన ధరలను మాత్రం (మిగతా 8వ పేజీలో)

'గ్రేడ్ల పేరిట బర్లీ పొగాకు రైతులను ఇబ్బంది పెట్టవద్దు. రెండే రకాలు.. లోగ్రేడ్ పొగాకు రూ.5 వేలు నుంచి రూ.6 వేలు ఇవ్వాలి. మీడియం, హై క్వాలిటీ రకానికి రూ.12 వేలు ధర ఇవ్వాలి. ఈ ఆదేశాల ను పొగాకు కంపెనీలు తప్పనిసరిగా పాటించాల్సిందే. అరకొరగా కొనుగోలు చేసి చేతులు దులుపుకుంటామంటే కుదరదు. చివరి ఆకు వరకు కంపెనీలు కొనుగోలు చేయాల్సిందే.' వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు సరిగ్గా పదిరోజుల కిత్రం మార్టూరులో పొగాకు కంపెనీలతో జరిపిన సమావేశంలో జారీ చేసిన ఆదేశాలివి. కానీ, ఇప్పటి వరకు 60 వేల క్వింటాల బర్లీ పొగాకు ట్రేడర్స్ కొనుగోలు చేసినట్లు క్షేత్రస్థాయి గణాం కాలు ధ్రువీకరిస్తున్నాయి. అది కూడా రూ.3 వేలు మొదలుకుని గరిష్ఠంగా రూ.8 వేలు ధర చెల్లించే ఈ కొను గోళ్లు జరిగినట్లు రైతులు చెబుతున్నారు.



అన్నదాతల.. ఆందోళన

సుఖీభవలో అప్‌లోడ్ కాని పేర్లు

- పెండింగ్‌లో ఇంకా 43,676 మంది రైతులు
- వివరాలను తహసీల్దార్లకు అందజేసిన వ్యవసాయశాఖ
- అర్హులుగా గుర్తింపునకు 12వ తేదీతో ముగియనున్న గడువు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

అన్నదాత సుఖీభవ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేయనున్నది. ఈ పథకానికి రైతులు సేవా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకుంటున్నారు. అయితే రీ సర్వేలో తలెత్తిన సాంకేతిక సమస్యలు వేలాది మంది రైతులకు ఇబ్బందికరంగా మారింది. జిల్లాలో 43,676 మంది రైతుల పేర్లు సుఖీభవ పథకంలో అప్‌లోడ్ కావడంలేదు. దీంతో ఈ పథకం తమకు వర్తిస్తుందో లేదో అన్న ఆందోళన రైతుల్లో నెలకొంది. అన్నదాత సుఖీభవ పథకం కింద కుటుంబం యూనిట్‌గా అర్హులైన రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం కలిపి ఏటా సాగు ఖర్చులకు రూ.20 వేలు సాయం అందించనున్నాయి. ఇప్పటికే పీఎం కిసాన్‌ను కేంద్ర ప్రభుత్వం మూడు విడతల్లో రూ.6 వేలను రైతుల ఖాతాలకు జమ చేస్తోంది. మరో రూ.14 వేలను రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అందించేందుకు సిద్ధమైంది. ఇందుకోసం అర్హులైన రైతుల జాబితా పరిశీలన జరుగుతోంది. ఈ నెల 12వ తేదీ వరకు సుఖీభవ అర్హులను గుర్తించి తుది జాబితాను ప్రభుత్వానికి అందజేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. రైతు సేవా కేంద్రాల్లో ఆధార్‌తో లబ్ధిదారుల పేర్లను పథకం కింద అప్‌లోడ్ చేస్తున్నారు. ఇలా అప్‌లోడ్ అయిన పేర్లు అన్నదాత సుఖీభవ వెబ్‌సైట్‌లో కనిపిస్తున్నాయి. ఈ పథకం స్టేటస్‌లో ఆధార్ నెంబర్‌ను నమోదు చేస్తే అప్రూవుడ్ అని ఉంటే పథకానికి అర్హత సాధించినట్లే. అప్రూవుడ్ అని రాకపోతే లబ్ధిదారుల జాబితాలో పేరు లేనట్లేనని అధికారులు చెబుతున్నారు. భూ రికార్డుల సమస్యలతో వేలాది మంది రైతులు సుఖీభవ పథకం కింద అనర్హులుగా ఉన్నారు. అనర్హుల జాబితాలో 43,676 మంది రైతులు ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. వీరి పేర్లను తహసీల్దార్లకు వ్యవసాయ శాఖ అందజేసింది. భూ రికార్డులు పరిశీలించి అభ్యంతరాలు లేకపోతే తహసీల్దార్లు సదరు రైతుల పేర్లను అర్హులుగా గుర్తించే అవకాశం ఉంది. ఈ ప్రక్రియ గడువు 12వ తేదీ వరకే ఉంది. అయితే ఇది జిల్లాలో నత్తనడకన సాగుతుండటంతో వేలాది మంది రైతులు ఆందోళన చెందుతున్నారు. గత ప్రభుత్వం రైతు భరోసా పొందిన రైతుల పేర్లు కూడా అన్నదాత సుఖీభవకు ఎంపిక కాలేదు. ఇలా వేలాది మంది పేర్లు పెండింగ్‌లో ఉన్నాయి.

- భూ రికార్డుల ప్రకారం రైతులు : 4,48,658
- పీఎం కిసాన్ పథకం లబ్ధి : 2,31,550
- వైసీపీ హయాంలో భరోసా : 2,81,181 మంది
- సుఖీభవకు ఇప్పటి వరకు అర్హత : 4,04,882



కొండ దిగువున గ్రావెల్ క్వారియింగ్ చేసిన ప్రదేశము

వైకుంఠపురంలో అక్రమ క్వారీయింగ్

వెంకన్నకొండ దిగువున గ్రావెల్ తవ్వకం... తరలింపు

అమరావతి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వైకుంఠపురంలో సోమవారం రాత్రి గ్రావెల్ అక్రమ క్వారీయింగ్ చేశారు. వెంకన్న కొండ దిగువన, ఉత్తరవాహిని తీర్థానికి వెళ్లే మార్గంలో గ్రావెల్ తవ్వి తరలించిన ఆనవాళ్లు మంగళవారం వెలుగుచూశాయి. గతంలో కూడా కొండకు ఉత్తరం వైపున ఇసుక ర్యాంప్ నిర్వాహకులు అక్రమంగా గ్రావెల్ క్వారీయింగ్ చేసి రోడ్లకు వినియోగించారు. గ్రామానికి చెందిన వారే తాజాగా కూడా క్వారీయింగ్‌కు పాల్పడినట్లు స్థానికులు తెలుపుతున్నారు. అక్రమ తవ్వకాల సమాచారంతో తహసీల్దారు ఆదేశాలతో రెవెన్యూ సిబ్బంది వెళ్లగా అప్పటికే అక్రమార్కులు క్వారీయింగ్ నిలిపేసి వెళ్లిపోయారని సమాచారం. గత ప్రభుత్వంలో కన్నా ప్రస్తుతం కృష్ణానదిలో, చెరువులలో, కొండ ప్రాంతాల్లో గ్రావెల్ అక్రమ క్వారీయింగ్ జరుగుతుందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అయితే అక్రమాలకు పాల్పడుతున్న అధికార పార్టీ నాయకుల జోలికి వెళ్లేందుకు అధికారులు సాహసించడంలేదని సమాచారం.



8

ఆవకాయకు కేరాఫ్

పెద్దపులివర్రు

- నాణ్యత, రుచిలో తగ్గేదే లేదు
- తెలుగు రాష్ట్రాలతో పాటు విదేశాలకు ఎగుమతి



చంటి పాపతో వచ్చిన మహిళ

ఆధార్ నవీకరణకు అగచాట్లు!

- ప్రైవేట్ కేంద్రాలపై కొరవడిన పర్యవేక్షణ
- ఇష్టారాజ్యంగా డబ్బు వసూలు
- చిన్నపిల్లలతో తల్లిదండ్రుల పడిగాపులు
- చేతులెత్తేసిన ప్రభుత్వ యంత్రాంగం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందుకోవాలంటే ఆధార్ తప్పనిసరి. ఆధార్ నవీకరణకు ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారు. ప్రైవేట్ ఆధార్ కేంద్రాల వద్ద బాలింతలు చంటి పిల్లలతో పడిగాపులు కాస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆధార్ నవీకరించాల్సి ఉండగా యంత్రాంగం చేతులెత్తేసింది. గతంలో పోస్టాఫీసుల్లో ఆధార్ నవీకరణ కేంద్రాలు ఉండేవి. వీటిని కూడా (మిగతా 8వ పేజీలో)



నరసరావుపేటలోని ప్రైవేట్ ఆధార్ కేంద్రంలో చిన్నారులతో తల్లిదండ్రుల పడిగాపులు

కృష్ణానదిపై బ్రిడ్జి!

- ఎన్టీఆర్ జిల్లా ముక్త్యాల- పల్నాడు జిల్లా మాదిపాడు మధ్య నిర్మాణం
- రూ.60.54 కోట్ల వ్యయంతో నెల రోజుల కిందట పనులు ప్రారంభం
- 13 పిల్లర్లతో 14.8 మీటర్ల వెడల్పుతో నిర్మాణం కానున్న బ్రిడ్జి

8

వీసీకి రిజిస్ట్రార్

క్లీన్‌చిట్

- వీసీపై ఆరోపణలు.. రిజిస్ట్రార్ విచారణ
- ఎన్జీ రంగా వర్సిటీలో వెలుగు చూస్తోన్న విచిత్రాలు

8

అత్యాచారం, హత్య కేసులో ముగ్గురు నిందితులకు జీవితఖైదు

6

ఇంకెప్పుడు మారుస్తారు?

- మున్సిపల్ చైర్‌పర్సన్‌గా కొనసాగుతున్న చలంచర్ల లక్ష్మి
- ఆమెను దించేందుకు వైసీపీ కౌన్సిలర్లు మద్దతు.. పట్టని టీడీపీ
- వైసీపీ హయాంలో అవినీతి జరిగిందంటున్న పలువురు కౌన్సిలర్లు



సత్తెనపల్లి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా వైసీపీ హయాంలో నిరంకుశంగా ఏకగ్రీవాలు చేసి ఏర్పరిచిన మున్సిపాలిటీలు, కార్పొరేషన్లపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. ఆయా మున్సిపాలిటీల్లో చోటుచేసుకున్న అక్రమాలపై చర్యలకు ఉపక్రమించింది. ఈ నేపథ్యంలో వైసీపీ నేతృత్వంలో ఉన్న స్థానాలను దక్కించుకోవడంతో కూటమి నాయకులు విజయాలు సాధిస్తూ వస్తున్నారు. అయితే సత్తెనపల్లి పురపాలక సంఘంలో మాత్రం వింత పరిస్థితులు ఉన్నాయి. 31 మంది కౌన్సిలర్లలో టీడీపీకి నలుగురు, జనసేనకు ఒకరు, ఇండిపెండెంట్లు ఇద్దరు, వైసీపీకి 24 మంది బలం ఉన్నారు. చైర్‌పర్సన్‌గా వైసీపీకి చెందిన చలంచర్ల లక్ష్మి ఉన్నారు. సార్వత్రిక ఎన్నికల ముందు వైసీపీకి చెందిన ముగ్గురు టీడీపీలో చేరారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చలంచర్ల లక్ష్మిని పదవి నుంచి దించితే తాము మద్దతు ఇస్తామని పది మంది వరకు వైసీపీ కౌన్సిలర్లు బహిరంగంగా ప్రకటించారు. అయినా స్థానిక టీడీపీ నాయకులు లక్ష్మిని పదవి నుంచి దింపకుండా కొనసాగేలా చూస్తున్నారు. చైర్‌పర్సన్ భర్త షాడోగా వ్యవహరిస్తూ గత వైసీపీ పాలనలో ఏ కౌన్సిలర్‌కు ప్రాధాన్యం ఇవ్వకుండా కాంట్రాక్టర్లతో కుమ్మక్కై అక్రమాలకు పాల్పడ్డారని వైసీపీ, జనసేన కౌన్సిలర్లు ఆరోపిస్తున్నారు. వైసీపీ హయాంలో పురపాలక సంఘంలో జరిగిన అవినీతిపై విజిలెన్స్ విచారణ జరిపించాలని, ర్యాటిఫికేషన్ పేరుతో కోట్లాది రూపాయలు దారి మళ్లించిన చైర్మన్ గద్దె దిగాలని జనసేన కౌన్సిలర్ రంగిశెట్టి సుమన్ కోరుతున్నారు. అవినీతి, అక్రమాలపై విచారణ జరిపితే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని కౌన్సిలర్లు చెప్తున్నారు. చైర్‌పర్సన్‌ను గద్దె దింపడానికి సహకరిస్తామని వైసీపీ కౌన్సిలర్లు ముందుకు వస్తున్నా కొంతమంది టీడీపీ నేతలు చైర్మన్ భర్తకు సహకరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. చైర్‌పర్సన్ చాంబర్‌ను ఆమె భర్త వైసీపీ పార్టీ కార్యక్రమాలకు, తన దందాలకు ఉపయోగిస్తున్నా అధికారులు పట్టిపట్టనట్టు వ్యవహరించడంపై కూడా కౌన్సిలర్లు ప్రశ్నిస్తున్నారు. ఎమ్మెల్యే ఈ విషయంపై దృష్టి సారించి చైర్మన్‌ను పదవి నుంచి దించాలని పలువురు కోరుతున్నారు.

రౌడీమూకలకు పరామర్శపై జగన్ సిగ్గుపడాలి



● మంత్రి అనగాని సత్యప్రసాద్

రేపల్లె, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): గంజాయి అమ్మే రౌడీ మూకలను పరామర్శించేందుకు తెనాలి వెళ్లిన జగన్ సిగ్గుపడాలని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు. 9 కేసులు ఎదుర్కొంటున్న జాన్ విక్టర్ అమాయకుడైన అడ్వకేట్ అంటూ చెప్పడం జగన్‌కే చెల్లిందన్నారు. ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ రౌడీమూలకతో దాడులు చేయించడమే రాజకీయంగా నడిపిన వ్యక్తి జగన్ అన్నారు. గత ఎన్నికల్లో జగన్ రౌడీ రాజకీయానికి ప్రజలు చెంప చెల్లుమనిపించినా క్రిమినల్ బుద్ధి ఇంకా మారలేదన్నారు. డ్రైవర్ సుబ్రహ్మణ్యంకు టుంబాన్ని పరామర్శించని జగన్ గంజాయి ముఠా వద్దకు మాత్రం పరిగెత్తుకుని వెళ్లాడని దుయ్యబట్టారు. జగన్‌కు తెలిసిందల్లా అరాచకం, బెదిరింపులు, అవినీతి, విధ్వంసం మాత్రమేనన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు కాపాడేందుకు పోలీసులు చర్యలు తీసుకుంటుంటే వారిపైన కూడా విషప్రచారం చేయడం జగన్‌కే చెల్లిందన్నారు.

అవినీతి, వెన్నుపోటుకు
బ్రాండ్ అంబాసిడర్ జగన్ రెడ్డి



● ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు

వినుకొండ, జూన్ 3, (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజకీయాల్లోనే మోసం, అవినీతి, వెన్నుపోటుకు బ్రాండ్ అంబాసిడర్‌గా నిలిచిన ఘనుడు జగన్‌రెడ్డి అని ప్రభుత్వ చీఫ్ విప్ జీ.వి ఆంజనేయులు ధ్వజమెత్తారు. జూన్ -4న వెన్నుపోటు దినంగా నిర్వహించాలని వైసీపీ అధ్యక్షుడు జగన్ ఇచ్చిన పిలుపుపై మంగళవారం ఒక ప్రకటణలో ఆయన తీవ్రంగా స్పందించారు. జగన్‌మోహన‌రెడ్డి నైజం గుర్తించిన ఆంధ్రప్రదేశ్ ప్రజలు గతేడాది జూన్-4న ఎన్నికల ఫలితాల్లో తగిన గుణపాఠం నేర్పారని పేర్కొన్నారు. కూటమికి అఖండ మెజార్టీతో ఆశీస్సులు అందించారన్నారు. ఇప్పుడు మద్యం కుంభకోణం బట్టబయలై అరెస్టు భయంతో కొత్త డ్రామాలు మొదలు పెట్టిన అతడు ఉల్టా చోర్ కొత్వాల్‌కు డాంటే అన్నట్లు ప్రజలు, కూటమి ప్రభుత్వంపైకే బురద జల్లే ప్రయత్నం చేస్తున్నాడని జీ.వి మండిపడ్డారు. ఒక్క చాన్స్ అన్న మాట నమ్మి ప్రజలు అధికారం ఇస్తే 85 శాతం హామీలను ఎగనామం పెట్టిన అసలైన వెన్నుపోటుదారు జగన్ అన్నారు. సొంత బాబాయిని హత్య చేసిన నిందితులను కాపాడడం, ఆస్తి కోసం తల్లినీ చెల్లిని గెంటేయడం, వైఎస్సార్ సీపీని శివకుమార్ నుంచి లాక్కోవడం. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సబ్ ప్లాన్ నిధులు రూ. లక్షల కోట్లలో కొల్ల కొట్టడం ఇవేనా జగన్ రెడ్డి అర్హతలని చురకలు వేశారు.

వైఎస్సార్ కడప క్రీడా పాఠశాల ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు(తూర్పు), జూన్ 3(ఆంధ్రజ్యోతి): వైఎస్సార్ కడప క్రీడా పాఠశాలలో 4, 5 తరగతుల్లో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డీఎస్‌డీవో నరసింహారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు ఈ నెల 19 లోపు ఏపీ స్పోర్ట్స్ స్కూల్ వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. 20 నుంచి 25వ తేదీ వరకు దరఖాస్తుల పరిశీలన, జూలై 1 నుంచి 3వ తేదీ వరకు జిల్లా స్థాయి ఎంపికలు జరుగుతాయన్నారు. జూలై 10న రాష్ట్రస్థాయి ఎంపికలు జరుగుతాయని, వివరాలకు 0863-2221957 నంబరుకు సంప్రదించాలన్నారు.

మా ఆస్తులను టీడీపీ ఎమ్మెల్యే అనుచరులే
కబ్జా చేశారు

- చిలకలూరిపేటలోని సాయికార్తీక్ సిటీ సెంటర్‌ను ఆక్రమించారు
- అక్రమ కేసులు పెడతాం, చంపేస్తామంటూ బెదిరిస్తున్నారు
- సీఎం చంద్రబాబునాయుడు మాకు న్యాయం చేయండి
- అక్కడికి వచ్చే పరిస్థితి లేక..హైదరాబాద్‌లో ప్రెస్‌మీట్..
- ఎన్నారై, టీడీపీ కార్యకర్త రావి మురళీమోహన్

హైదరాబాద్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): 'పాతికేళ్ల క్రితం అమెరికా వెళ్లా. పైసాపైసా కూడబెట్టి రూ.60 కోట్ల వ్యయంతో సిటీ సెంటర్ పేరుతో రెండు థియేటర్లు, రెండు ఫంక్షన్ హాళ్లు, రెండు అంతస్తుల వాణిజ్య సముదాయాలు నిర్మించా. 30 ఏళ్లుగా తెలుగు దేశం పార్టీ కార్యకర్తగా ఉన్నా. ఎన్ఆర్ఐగా గత ఎన్నికల్లో పార్టీ విజయం కోసం కృషి చేశా. ఇప్పుడు నా సిటీ సెంటర్‌పై సొంత పార్టీకే చెందిన ఎమ్మెల్యే అనుచరుల కన్ను పడింది. సిటీ సెంటర్‌తో పాటు పక్కనే ఉన్న సముదాయాన్ని కబ్జా చేశారు. న్యాయం కోసం పోలీసులను ఆశ్రయిస్తే పట్టించుకోవడం లేదు. న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాలను కూడా బేఖాతరు చేస్తున్నారు. అక్కడికి వస్తే తప్పుడు కేసులు పెడతాం, చంపేస్తామని బెదిరిస్తున్నారు. నాకు, నా కుటుంబ సభ్యులకు ప్రాణహాని ఉంది. ఏపీ సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్ స్పందించి నాకు న్యాయం చేయాలి. నా ఆస్తులు నాకు అప్పగించి,రక్షణ కల్పించాలి' అని ఓ ఎన్ఆర్ఐ వేడుకున్నారు.

మంగళవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో చిలకలూరిపేటకు చెందిన ఎన్ఆర్ఐ రావి మురళీమోహన్, తన తల్లిదండ్రులు రావి సుధాకర్, రావి సామ్రాజ్యంతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. తాను పాతికేళ్ల క్రితం అమెరికా వెళ్లానని, అక్కడ పైసాపైసా కూడబెట్టి చిలకలూరిపేటలో స్థలాన్ని కొనుగోలు చేసి, బ్యాంకు రుణాలతో సుమారు రూ.60 కోట్ల వ్యయంతో 2017లో సాయికార్తీక్ సిటీ సెంటర్ షాపింగ్ కాంప్లెక్స్‌ను నిర్మించానని తెలిపారు. అందులో రెండు సినిమా థియేటర్లు, రెండు ఫంక్షన్ హాళ్లు, రెండు అంతస్తుల వాణిజ్య సముదాయాలు ఉన్నాయని తెలిపారు. తన కాంప్లెక్స్‌ను గతేడాది ఆగస్టు 5న స్థానిక ఎమ్మెల్యే, మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు అనుచరులు కబ్జా చేశారని ఆరోపించారు. తన తండ్రి కందిమళ్ల అంజిబాబు అనే వ్యక్తి నుంచి రూ.97 లక్షలు అప్పు తీసుకున్నారని, ఇందుకు సంబంధించిన ఎలాంటి ఆధారాలు ఆక్రమణదారులు అందించలేదన్నారు. తనకు అప్పుతో సంబంధం లేదని చెప్పారు. అప్పు తీసుకున్న మాట నిజమైతే దానిని చెల్లించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని చెప్పారు. ఆర్థిక లావాదేవీల్లో ఏమైనా తేడా ఉంటే కూర్చుని మాట్లాడుకుంటే సరిపోతుందన్నారు. కానీ, తన కాంప్లెక్స్‌ను ఆక్రమించిన వ్యక్తులు లోపలికి ఎవరినీ అనుమతించడం లేదని, కాంప్లెక్స్ ముందు టెంట్ వేసుకుని కొంతమంది నిత్యం కూర్చుంటున్నారని తెలిపారు. కాంప్లెక్స్‌లో అద్దెకు ఉంటున్న వారిని భయభ్రాంతులకు గురిచేసి బయటికి వెళ్లగొట్టారని చెప్పారు. స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోలేదని, హైకోర్టును ఆశ్రయించగా అప్పుడు కేసు నమోదు చేశారని తెలిపారు. అయినా కూడా పోలీసులు ఆక్రమణదారులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని అన్నారు. గతేడాది ఆగస్టు 23న కాంప్లెక్స్‌లో సీసీ కెమెరాలను కూడా పగులగొట్టారని చెప్పారు. తాము 100 నంబరుకు ఫోన్ చేసినా, పోలీస్‌స్టేషన్‌కు వెళ్లినా, రిజిస్టర్డ్ పోస్టు ద్వారా ఫిర్యాదు చేసినా పోలీసులు స్పందించలేదని తెలిపారు. మళ్లీ హైకోర్టును



సమావేశంలో తల్లిదండ్రులు రావి సుధాకర్,రావి సామ్రాజ్యంలతో కలిసి వివరాలు వెల్లడిస్తున్న బాధితుడు ఎన్నారై, టీడీపీ కార్యకర్త రావి మురళీమోహన్

ఆశ్రయించగా.. గతేడాది నవంబరులో రక్షణ కల్పించాలని ఆదేశించినా పోలీసులు పట్టించుకోలేదని చెప్పారు. కోర్టు ఆదేశాల మేరకు తాము మళ్లీ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుని, సినిమా థియేటర్‌లో చిత్రాలు నడవడానికి కూడా రెండు సినిమాలు బుక్ చేసుకున్నామని తెలిపారు. కబ్జాదారులు తమతో పాటు అక్కడికి వచ్చిన వారిని బెదిరించి, కాంప్లెక్స్ అద్దాలు పగులగొట్టి భయభ్రాంతులకు గురిచేశారని వివరించారు. దీంతో ఫిబ్రవరిలో మళ్లీ హైకోర్టులో కోర్ట్ ధిక్కరణ పిటిషన్ వేశామని చెప్పారు. స్థానిక సీఐ రమేష్ అక్కడ ఏమీ జరగడం లేదని న్యాయస్థానానికి తప్పుడు అఫిడవిట్ ఇచ్చాడని ఆరోపించారు. తమను కాంప్లెక్స్‌లోకి వెళ్లనివ్వడం లేదని, తన తండ్రిపై అక్రమ కేసులు పెట్టారని, తాను వస్తే మాదక ద్రవ్యాల కేసు పెడతామని, రహదారిపై దుస్తులు ఊడదీసి కొడతామని హెచ్చరించారని తెలిపారు.

కాంప్లెక్స్ కబ్జా కారణంగా అందులో పనిచేసే 40 మందికి పైగా ఉద్యోగులు జీవనోపాధిని కోల్పోయారని, పక్కనే తన భార్య పేరు మీద ఉన్న ఐస్ ఫ్యాక్టరీ కూడా మూతపడటంతో అక్కడి కార్మికులు ఉపాధి, ఆదాయం కోల్పోతున్నారని చెప్పారు. కేసుల భయంతో తన తండ్రి హైదరాబాద్ కు వచ్చి ఉంటున్నారని, తన తల్లి క్యాన్సర్ వ్యాధితో బాధపడుతుందని ఆమె ఒక్కతే అక్కడ ఒంటరిగా నివసిస్తుండగా.. ఆక్రమణదారులు ఆమెకు ఆహారం, ఔషధాలు అందకుండా అడ్డుకుంటున్నారని తెలిపారు. సీసీ కెమెరాల వైర్లు ధ్వంసం చేసి, ఇంటర్నెట్ సౌకర్యం నిలిపివేసి ఆక్రమణదారులు తమ ఆస్తిని పూర్తిగా తమ నియంత్రణలోకి తీసుకున్నారని తెలిపారు. పలుమార్లు చిలకలూరిపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ, పోలీసులు దీనిని సివిల్ విషయంగా పరిగణించి చర్యలు తీసుకోలేదన్నారు. జాతీయ మానవ హక్కుల కమిషన్, హైకోర్టును ఆశ్రయించానని వెల్లడించారు. కోర్టు తీర్పు తమకు అనుకూలంగా వచ్చినప్పటికీ స్థానిక పోలీసులు దానిని అమలు చేయడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యే అనుచరుల ప్రమేయం కారణంగా పోలీసులు సహకరించడం లేదని, తనపై, కుటుంబ సభ్యులపై అక్రమ కేసులు పెడుతూ, చంపేస్తామని బెదిరిస్తున్నారని తెలిపారు. తనను ఎన్ కౌంటర్ చేస్తామని బెదిరిస్తున్నారని వాపోయారు. తమ ఆస్తి కబ్జా, బెదిరింపులపై తమ పార్టీ అధినేత, ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్‌కు పలుమార్లు ఫిర్యాదు చేశామన్నారు. తన కుటుంబం ఆర్థికంగా, మానసిక చిలకలూరిపేటకు పోలేక తల్లిని హైదరాబాద్‌కు పిలిపించుకుని ఈ సమావేశం పెట్టినట్లు చెప్పారు. న్యాయ పోరాటం కొనసాగిస్తానని, సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి లోకేశ్ తమకు న్యాయం చేస్తారనే నమ్మకం ఉందని తెలిపారు.

అత్యాచారం, హత్య కేసులో ముగ్గురు నిందితులకు జీవితఖైదు

మాచర్ల రూరల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మాచర్ల మండలం నాగులవరం పంచాయతీ పెద అనుపు చెంచుకాలనీలో అత్యాచారం, హత్యకు గురైన ఆశావర్కర్ రమావత్ నీలావతి కేసులో ముగ్గురు నిందితులకు కోర్టు జీవితఖైదు విధించడం జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. మాచర్ల మండలం పెద అనుపు చెంచు కాలనీకి చెందిన రమావత్ నీలావతి (46) కొప్పునూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని అనుపు, బీకేవీ పాలెం చెంచు కాలనీల్లో ఆశ వర్కరుగా విధులు నిర్వహిస్తోంది. 2022 సెప్టెంబరు 16న సాయంత్రం 6 గంటలకు భర్త లస్కర్ నీలావతితో మాట్లాడి పొలానికి వెళ్లాడు. మరుసటి రోజు ఉదయం ఇంటికి రాగా నీలావతి ఇంట్లో కనిపించలేదు. నీలావతి తండ్రి లాలుతో కలిసి గ్రామంలో విచారించారు. రాత్రి తమ ఇంటి వైపు నీలావతి వచ్చిందని సెల్‌ఫోన్ పోయిందని చెప్పిందని మండ్లి ముత్తయ్య అనే వ్యక్తి వారికి చెప్పాడు. అదే సమయంలో బీకేవీ పాలేనికి చెందిన చావిటి చిన అంజి, శీలం అంజి, బైస్వామి కూలీ డబ్బులు కోసం తన వద్దకు వచ్చారని తెలిపాడు. ఆ ముగ్గురు బీకేవీపాలెంలో ఉన్న వెంకన్న అనే వ్యక్తి పోయిన సెల్‌ఫోన్ ఎక్కడుందో కనిపెడతాడని చెప్పడంతో నీలావతి ఆ గ్రామానికి వెళ్లిందని చెప్పాడు. దీంతో భర్త లస్కర్, గ్రామస్తులు వెంకన్నను విచారించగా తన వద్దకు వచ్చిన మాట వాస్తవమేనని, సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్ అయిందని, తరువాత రోజు వస్తే చూస్తానని చెప్పడంతో నీలావతితోపాటు ఆ ముగ్గురు వ్యక్తులు నడుచుకుంటూ వెళ్లారని చెప్పాడు. గతంలో నేర చరిత్ర ఉన్న చావిటి చిన అంజి, శీలం అంజిలను గ్రామస్తులు ఘట్టిగా ప్రశ్నించడంతో ముగ్గురం అత్యాచారం చేశామని, నీలావతి గొడవ చేయడంతో రాయితో తలపై కొట్టడంతో మృతి చెందిందని చెప్పారు. రోడ్డు పక్కన సమీపంలో రెండు బండరాళ్ల మధ్య నీలావతి మృతదేహాన్ని ఉంచి తాటాకులు కప్పినట్లు చెప్పి ఘటనా ప్రదేశాన్ని చూపారు. విషయాన్ని లస్కర్, గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించడంతో చావిటి చిన అంజి, శీలం అంజి, బైస్వామిలను అదుపులోకి తీసుకున్నారు. మృతురాలి భర్త లస్కర్ ఫిర్యాదు మేరకు అప్పటి విజయపురిసౌత్ ఎస్ఐ అనిల్‌కుమార్‌రెడ్డి నిందితులపై క్రైం నంబరు 82బై2022 సెక్షన్ 376డి, 376ఏ, 302, 201బై34ఐపీసీ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. గుంటూరు అడిషనల్ జడ్జి కె.నీలిమా నిందితులపై నేరారోపణ రుజువు కావడంతో ముగ్గురికి జీవిత ఖైదు, రూ.70 వేల చొప్పున జరిమానా విధిస్తూ మంగళవారం తీర్పునిచ్చారు.



శీలం బైస్వామి (ఫైల్) | చావిటి చిన అంజి (ఫైల్) | శీలం అంజి (ఫైల్)

జగనాసుర పీడ విరగడై ఏడాది!



- గురజాల ఎమ్మెల్యే యరపతినేని

పిడుగురాళ్ల, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): జగనాసుర వధ జరిగి.. సైకో ప్రభుత్వం గద్దె దిగి ప్రజా ప్రభుత్వం ఎన్డీఏ అధికారం చేపట్టి నేటికి సంవత్సరం అయిందని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ వన్‌సైడ్ మెజార్టీతోనే 164 సీట్లతో అధికారంలోకి వచ్చిన రోజు, ఆర్థిక వ్యవస్థ పతనం కావడానికి కారకుడైన జగన్‌మోహన్‌రెడ్డి గద్దె దిగిన రోజు.. ఒక పండుగ రోజు అన్నారు. ఎన్డీఏ శ్రేణుల్లో ఒక పండుగ లాంటి వాతావరణం జరుపుకునే పరిస్థితి ఆంధ్ర రాష్ట్రంలో ఉందన్నారు. కానీ, ఈ నయవంచక వైసీపీ నాయకులు దానిని వెన్నుపోటు దినంగా బావిస్తున్నారన్నారు. తల్లిని, చెల్లిని వంచించిన వాడు అసలు సిసలైన వెన్నుపోటుదారుడని, బాబాయిని గొడ్డలి పోటుతో చంపి గుండెపోటు అని నమ్మించే ప్రయత్నం చేసిన జగన్ నిజమైన వెన్నుపోటుదారుడు అని యరపతినేని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెనాలిలో గంజాయి తాగి కానిస్టేబుల్‌పై దాడి చేసిన వ్యక్తులను జగన్‌మోహన్‌రెడ్డి పరామర్శించడం దేనికి సంకేతమో వైసీపీ నాయకులు తెలపాలన్నారు.

వెన్ను పోటు, గొడ్డలి వేటు పేటెంట్ జగన్‌రెడ్డిదే



ఎమ్మెల్యే కన్నా

సత్తెనపల్లి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : వెన్నుపోటు, గొడ్డలి వేటు పేటెంట్ జగన్‌రెడ్డిదేనని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కుంభ కోణాల నుంచి ప్రజా దృష్టి మరల్చడానికి ధర్నాల డ్రామాను జగన్ ముఠా ఆడుతోందన్నారు. తొలి ఏడాదిలో పది శాతం హామీలను కూడా గత ప్రభుత్వం అమలు చేయలేదని గుర్తుచేశారు. ఏ ప్రభుత్వం చేయని విధంగా తొలి ఏడాదిలో 70 శాతం హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేసిందన్నారు. ఐదు సంవత్సరాల్లో 85 శాతం హామీలకు జగన్ ప్రభుత్వం యగనామం పెట్టిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీని అడ్డం పెట్టుకొని రూ.లక్షల కోట్లు దోచుకొని అదే పార్టీకి వెన్ను పోటు పొడిచి వైసీపీ పార్టీని జగన్ స్థాపించాడన్నారు. శివ కుమార్ స్థాపించిన వైసీపీని జగన్ కబ్జా చేసి వెన్ను పోటు పొడిచాడన్నారు. ఎత్తుకొని పెంచిన బాబాయిని గొడ్డలి వేటుతో నరికి చంపిన కిరాతకులను కాపాడుతూ రక్త సంబంధానికి వెన్ను పోటు పొడిచారన్నారు. ఆస్తి కోసం తల్లిని, చెల్లిని ఇంటి నుంచి గెంటేసి కుటుంబ వ్యవస్థకే వెన్ను పోటు పొడిచాడన్నారు. మెగా డీఎస్సీ పై మాట తప్పి యువతకు వెన్ను పోటు పొడిచాడన్నారు.

సైకోలను పరామర్శించడం సిగ్గుచేటు



ఎమ్మెల్యే నరేంద్ర

పొన్నూరుటౌన్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): పులివెందుల శాసనసభ్యుడు జగన్‌రెడ్డి తెనాలిలో గంజాయి సైకోలను పరామర్శించడం సిగ్గుచేటని ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్ మంగళవారం అన్నారు. మరోసారి సైకోలను మానసికంగా జగన్‌రెడ్డి సిద్ధం చేస్తున్నారని ఆరోపించారు. జగన్ పర్యటన సందర్భంగా పోలీస్ వాహనంపైకి ఎక్కి హల్‌చల్ చేయడం జగన్ 2.0కి నిదర్శనమన్నారు. తెనాలిలలో సైకోల వికృత చేష్టలకు ప్రజలు భయాందోళనలు ఉన్నాయన్నారు. ప్రజలు జగన్‌రెడ్డిని ఓడించినా ఆయన వైఖరిలో మార్పు రాలేదన్నారు. జగన్ లాంటి వ్యక్తులకు ప్రజల్లో తిరిగే నైతిక హక్కు.. ప్రజాస్వామ్యంలో ఉండే హక్కు లేదన్నారు. 2.0 చూపిస్తానంటూ సైకోలను ఉసిగొలిపి అరాచకాలను మళ్లీ మొదలు పెట్టే ప్రయత్నం జరుగుతోందని హెచ్చరించారు. పోలీస్ వాహనం పైకి ఎక్కి హల్ చల్ చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే నరేంద్రకుమార్ డిమాండ్ చేశారు.

రేపు జీడీసీసీ బ్యాంకు చైర్మన్
మక్కెన ప్రమాణ స్వీకారం

గుంటూరు, జూన్ 3(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు చైర్మన్‌గా మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు గురువారం ప్రమాణస్వీకారం చేయనున్నారు. డీసీసీబీ చైర్మన్‌గా మక్కెనను నియమిస్తూ ఇటీవల ప్రభుత్వం నుంచి అధికారిక ఉత్తర్వులు విడుదలైన విషయం తెలిసిందే. ఉదయం 11 గంటలకు గుంటూరు బ్రాడీ పేటలోని ఎన్‌టీఆర్ సహకార భవన్‌లో ప్రమాణస్వీకార కార్యక్రమం జరుగుతుందని అధికారులు తెలిపారు. కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌తో పాటు వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు, జిల్లాలోని ఎమ్మెల్యేలు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.

డీసీఎంఎస్ చైర్మన్‌గా హరిబాబు

జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ చైర్మన్‌గా వడ్రాణం హరిబాబు గురువారం బాధ్యతలు స్వీకరించనున్నారు. జిల్లా కోర్టు రోడ్డులోని డీసీఎంఎస్ కార్యాలయంలో ఆయన అధికారుల నుంచి బాధ్యతలు తీసుకుంటారు. చైర్మన్ హరిబాబుకు ఈ నెల 14న ఆత్మీయుల అభినందన సభ నిర్వహించనున్నట్లు తెలిపారు.

ద్విచక్ర వాహనదారుడిపై దారి దోపిడీ

- నిందితుడికి 21 ఏళ్లు..నాలుగు జిల్లాల్లో 27 కేసులు

ప్రత్తిపాడు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): నగదు కోసం ద్విచక్ర వాహనదారుడిపై ముగ్గురు యువకులు దారి దోపిడీకి పాల్పడిన ఘటన మంగళవారం ఉదయం నిమ్మగడ్డవారిపాలెంలో చోటు చేసుకుంది. తుమ్మలపాలేనికి చెందిన శాకమూరి శ్రీనివాసరావు తన గొర్రెల వద్దకు వెళ్తుండగా అతనిపై దాడి చేసి, జేబులోని నుంచి రూ.3,500 నగదు లాక్కుని నంబరు ప్లేటు లేని బైక్ పై అక్కడి నుంచి వెళ్లిపోయారు. బాధితుడు విషయాన్ని బంధువులకు తెలపడంతో అప్రమత్తమయ్యారు. దుండగులు ముగ్గురూ బోయపాలెం వద్ద మద్యం దుకాణంలో మద్యం తాగుతుండగా.. వారిని పట్టుకునే ప్రయత్నం చేశారు. ఒకరిని దొరకబుచ్చుకోగా ఇద్దరు పరారయ్యారు. అతనిని ప్రత్తిపాడు పోలీసులకు అప్పగించారు. పట్టుబడిన వ్యక్తి నరసరావుపేటకు చెందిన దేవర భవానీ ప్రసాద్‌గా గుర్తించారు. అతని వయస్సు 21 సంవత్సరాలు. అతనిపై నాలుగైదు జిల్లాల పరిధిలో వివిధ పోలీస్ స్టేషన్‌లలో 27 కేసులు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ప్రత్తిపాడు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

'ఏటీఎం' దొంగ అరెస్ట్



పోలీసులు అదుపులోకి తీసుకున్న నిందితుడు సురేష్ (రెడ్ టీ షర్ట్ వ్యక్తి)

తాడేపల్లి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఏటీఎంల వద్ద కాపు కాసి నగదు తీయడం రాని వారిని మోసం చేసే వ్యక్తిని మంగళవారం తాడేపల్లి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఐ ప్రతాప్ వివరాల మేరకు.. ఉండవల్లి కూడలిలో ఏసీబీఐ బ్యాంకు ఏటీఎం వద్ద ఓ వృద్ధురాలి ఏటీఎం కార్డును ఓ వ్యక్తి మారుస్తున్న సమయంలో పక్కనే ఉన్న బ్యాంకు సిబ్బంది గమనించారు. సదరు వ్యక్తిని పట్టుకుని పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నామని ఎస్ఐ తెలిపారు. నిందితుడు ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీం పట్నం ప్రాంతానికి చెందిన పి.సురేష్ గా గుర్తించారు. అతను ఇలాంటి ఘటనలకు పాల్పడుతున్నట్లు గుర్తించామని, గతంలోనూ సురేష్‌పై పలు కేసులు ఉన్నాయని వెల్లడించారు.

ఏఎన్‌యూ పీజీ మొదటి సెమిస్టర్ ఫలితాలు విడుదల

పెదకాకాని, జూన్ 3(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పరిధిలోని పీజీ మొదటి సెమిస్టర్ పరీక్ష ల ఫలితాలను మంగళవారం విడుదల చేశారు. వర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి ఆలపాటి శివ ప్రసాదరావు వివరాలు వెల్లడించారు. ఎంఏ ఆర్కియాలజీ, ఎకనమిక్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, పొలిటికల్ సైన్స్, హిస్టరీ, పర్ఫార్మింగ్ ఆర్ట్స్, డ్యాన్స్, అప్లైడ్ లింగ్విస్టిక్స్, ఎంసీఏ పీజీ కోర్సులతో పాటు డిప్లొమా ఇన్ ఫొటోగ్రఫీ ఫలితాలను సైతం వెలువరించామని సీఈ పేర్కొన్నారు. పునః మూల్యాంకనం కోసం జూన్ 10 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన తెలిపారు. ఇటీవల జరిగిన పీజీ ఫలితాలు కూడా అతి త్వరలో ప్రకటిస్తామని చెప్పారు.

ఏఐ పరిశోధనలకు డాక్టరేట్



మల్లికార్జునరావును అభినందిస్తున్న ఇన్‌చార్జి వీసీ గంగాధరరావు

పెదకాకాని, జూన్ 3(ఆంధ్రజ్యోతి): కృత్రిమ మేధ(ఆర్టిఫిషియల్ ఇంటిలి జెన్స్) పై ఏఎన్‌యూలో పరిశోధనలకు వీవీఐటీ కళాశాల సహాయ ఆచార్యులు సింహాద్రి మల్లికార్జునరావు డాక్టరేట్ పొందారు. ఏఎన్‌యూలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలో వర్సిటీ తాత్కాలిక వీసీ ఆచార్య కంచర్ల గంగాధర్‌రావు స్వీయ పర్యవేక్షణలో ఈ పరిశోధన జరిగిందని మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. డాక్టర్ సింహాద్రి మల్లికార్జునరావు మాట్లాడుతూ తన పరిశోధన గ్రంథంలో పలు జాతీయ, అంతర్జాతీయ వ్యాసాలు ప్రచురితమైనట్లు పేర్కొన్నారు.


ఈజిప్టులో అఖిలపక్ష బృందం



కైరోలోని జమాలెక్‌లో అల్-హొర్రెయా పార్కులో మహాత్మాగాంధీకి నివాళులర్పిస్తున్న అఖిలపక్ష ఎంపీల బృందం

నరసరావుపేట టౌన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఉగ్రవాదాన్ని అరికట్టేందుకు వ్యూహాత్మక ప్రణాళికతో ప్రపంచ పర్యటన నిర్వహిస్తున్న అఖిలపక్ష బృందాల్లో ఒకటైన సుప్రియా సూలే నేతృత్వంలోని బృందం మంగళవారం ఈజిప్టులో పర్యటించింది. ముందుగా కైరోలోని జమాలెక్‌లోని అల్-హొర్రెయా పార్కులో మహాత్మా గాంధీకి ఈ ప్రతినిధి బృందం నివాళులర్పించింది. ఈ బృందం ఆ దేశంలోని ప్రస్తుత, మాజీ మంత్రులు, ప్రముఖ రచయితలు, సమాజికర్తలు, నాయకులతో సహా ఈజిప్టులోని కీలక సంభాషణ కర్తలతో కూడా చర్చలు జరుపుతోంది. ఉగ్రవాద నిరోధకతపై సన్నిహిత ద్వైపాక్షిక సహకారం గురించి వివరిస్తూ దేశ సహకారాన్ని కోరుతున్నారు. బృందంలో ఎంపీలు సుప్రియా సూలే, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు ఉన్నారు.

పరువు గురించి మాట్లాడే అర్హత జగన్‌కు లేదు: గాదె



సమావేశంలో మాట్లాడుతున్న గాదె వెంకటేశ్వరరావు, పార్టీ శ్రేణులు

తెనాలిరూరల్, జూన్3(ఆంధ్రజ్యోతి): ఐతానగర్‌లో రౌడీయిజాన్ని పెంచేలా పాలన చేసింది జగన్ ప్రభుత్వమేనని.. కూటమి రావడంతో వాటిని అనగదొక్కుతుంటే నీచరాజకీయాలకు తెరలేపి కులాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టేందుకు వైసీపీ పూనుకోవడం బాధాకరమని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు అన్నారు. జగన్ తెనాలి పర్యటనను ఖండిస్తూ పార్టీ కార్యాలయంలో నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. గతంలో ఏ రాజకీయ నాయకుడు చేయని విధంగా జగన్ తెనాలిలో పర్యటించి రౌడీషీటర్లకు మద్దతుగా నిలిచారన్నారు. ఒకప్పుడు ఐతానగర్ పేరు చెబితే ఎంతో ప్రశాంతంగా ఉండేదని వైసీపీ ఐదేళ్ల పాలనలో రౌడీలకు, మహిళలపై హత్యాచారాలకు, దోపిడీలకు, గంజాయికి, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందని ఆరోపించారు. మంత్రి మనోహర్ రౌడీయిజం, గంజాయి, అసాంఘిక కార్యకలాపాలను ఎట్టిపరిస్థితుల్లో ఉపేక్షించవద్దని పోలీస్ శాఖకు కచ్చితమైన ఆదేశాలిచ్చారన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మాచర్లటౌన్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): మాచర్ల పట్టణంలో బుధవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ పట్టణ ఏఈ కోటేశ్వరరావు తెలిపారు. 11కేవీ బాలాజీ నగర్ ఫీడర్‌లో రెక్టిఫికేషన్ పనులు నిమిత్తం పట్టణంలోని వినాయకుని గుట్ట, ఆజాద్‌నగర్, జయంతి నగర్, మున్సిపల్ పంపుహౌస్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు చెప్పారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

● దుర్గి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): దుర్గిలో బుధవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ శ్రీశైలం తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

● కారంపూడి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నరమాలపాడు, మిర్యాల, ఒప్పిచర్ల, చింతపల్లి గ్రామాల పరిధిలో బుధవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగించనున్నట్లు ఏఈ గొల్లపల్లి వీరాంజనేయులు తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు చెప్పారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు అనుపులో యోగాంధ్ర - 2025

● హాజరుకానున్న కలెక్టర్ అరుణ్‌బాబు

మాచర్ల రూరల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనుపులో యోగాంధ్ర - 2025 కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ బందెల కిరణ్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ అరుణ్‌బాబు, జాయింట్ కలెక్టర్, గురజాల ఆర్డీవోతోపాటు అన్ని ప్రభుత్వశాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన నున్నట్లు చెప్పారు. ఉదయం 6:30 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని తహసీల్దార్ కిరణ్‌కుమార్ చెప్పారు.

● దుర్గి, జూన్ 3(ఆంధ్రజ్యోతి): మాచర్ల మండలం అనుపులో బుధవారం నిర్వహించనున్న యోగాంధ్ర - 2025 కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ తరలిరావాలని ఎంపీడీవో శివప్రసాద్ కోరారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ కార్యక్రమంలో మండల ప్రజలు విరివిగా పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

నేడు మండల పరిషత్ సమావేశం

మాచవరం, జూన్ 3(ఆంధ్రజ్యోతి): స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో బుధవారం సర్వసభ్య సమావేశం నిర్వహిస్తామని ఎంపీడీవో వెంగళరావు మంగళవారం తెలిపారు. ఎంపీపీ దారం అంబులమ్మ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, జెడ్పీటీసీ, సర్పంచ్‌లు, ప్రభుత్వ శాఖల అధికారులు తగు సమాచారంతో హాజరుకావాలని ఆయన కోరారు.

వేసవి విజ్ఞాన శిబిరం

అచ్చంపేట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : అచ్చంపేటలోని గ్రంథాలయంలో మంగళవారం సమ్మర్ క్యాంపులో భాగంగా విద్యార్థులకు పుస్తక పఠనం గురించి గ్రంథాలయ అధికారి బీ నాగరాజు తెలిపారు. 15మంది బాల బాలికలు సమ్మర్ క్యాంపులో పాల్గొన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులకు పుస్తకాల గురించి వివరించారు.

పచ్చి రొట్ట విత్తనాలు సిద్ధం

దాచేపల్లి, జూన్ 3(ఆంధ్రజ్యోతి): రైతు సేవా కేంద్రాల్లో పచ్చి రొట్ట విత్తనాలు అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయని వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. రైతులు ఆధార్ కార్డు, 1బీ జిరాక్స్ తీసుకొని వస్తే 50శాతం సబ్సిడీపై విత్తనాలు అందజేస్తారని తెలిపారు.

దుర్గి మండల ఆర్ఐగా యోబు



చాగంటి యోబు

దుర్గి, జూన్ 3(ఆంధ్రజ్యోతి): దుర్గి మండల ఆర్ఐగా చాగంటి యోబు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. గురజాల ఆర్డీవో కార్యాలయంలో ఆర్ఐగా విధులు నిర్వహిస్తున్న ఆయన దుర్గికి బదిలీపై వచ్చారు.

మెరుగైన ఆరోగ్యం కోసం యోగాను అలవర్చుకోవాలి

● కో-ఆర్డినేటర్ శ్రీనివాస్

బెల్లంకొండ, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : మెరుగైన ఆరోగ్యం కోసం యోగాను అలవర్చుకోవాలని మండల యోగా కో-ఆర్డినేటర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. బెల్లంకొండలో మంగళవారం యోగా క్లాసులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగేంద్రాల్లో గ్రామస్తులకు యోగా శిక్షణ శిబిరం, యోగా పోటీలను సిద్ధం చేస్తామని అన్నారు. ఆరోగ్య, స్వర్ణాంధ్ర సహకారమే యోగేంద్ర - 2025 అంతిమ లక్ష్యమని ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు సంకల్పమని పేర్కొన్నారు. బెల్లంకొండ మండలంలోని అన్ని సచివాలయాల్లో యోగా సాధకులు యోగా పోటీలను మండల స్థాయి పోటీలకు, జిల్లా స్థాయి పోటీలు, రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనాలని సూచించారు. అనంతరం యోగా క్లాసులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో యోగా టీచర్ కోటేశ్వరమ్మ, గురుస్వామి, విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

మృతుల కుటుంబీకులకు రూ.40 లక్షలు విడుదల

● ఎస్‌బీఐ మేనేజర్ ఆంజనేయులు

రెంటచింతల, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఎస్‌బీఐ వ్యక్తిగత ప్రమాద బీమా పథకం కింద మృతి చెందిన ఒక కుటుంబానికి రూ.40 లక్షలు విడుదలైనట్లు ఎస్‌బీఐ మేనేజర్ ఎస్ అంజనేయులు నాయక్ చెప్పారు. కిందటేడాది నవంబరు 16న రెంటచింతలకు చెందిన నీలా సత్యనారాయణ, పద్మావతి దంపతులు ప్రమాదవశాత్తు సత్రశాల వద్ద కృష్ణానదిలో పడి గల్లంతవ్వగా 18వ తేదీన మృతదేహాలు లభ్యమయ్యాయి. మృతి చెందిన వారు ప్రమాద బీమా చేయడం వల్ల ఎస్‌బీఐ అధికారులు రూ.40 లక్షలు విడుదల చేసిందన్నారు. ఈనెల 5వ తేదీన ఆర్ఎం పి.రవికుమార్ చేతుల మీదుగా చెక్కులను అందచేస్తామన్నారు.

అతిథి గృహం లేక అగచాట్లు

● ఆర్‌అండ్‌బీ బంగ్లా కూలగొట్టి రెండు దశాబ్దాలు

● నూతన నిర్మాణం ఊసెత్తని అధికారులు



శిథిలమైన శంకుస్థాపన శిలాఫలకం



ఆర్‌అండ్‌బీ బంగ్లాను కూల గొట్టగా మిగిలి ఉన్న మొండి గోడ

క్రోసూరు, జూన్ 3(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రం ఆర్‌అండ్‌బీ బంగ్లా కూలగొట్టి రెండు దశాబ్దాలు గడుస్తున్నా.. నూతన భవన నిర్మాణం ఊసే ఎత్తడం లేదు. అధికారులు 2005లో శిథిలమైన ఆర్‌అండ్‌బీ బంగ్లాను.. నూతన భవన నిర్మాణం కోసం కూల్చేశారు. కొత్త భవన నిర్మాణం కోసం రూ.20 లక్షలకు 2006లో టెండర్లు కూడా పిలిచి ఖరారు చేశారు. 2007 మేలో అప్పటి ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి జీవన్ రెడ్డి, అప్పటి పంచాయతీరాజ్ శాఖ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ హయాంలో శంకుస్థాపన జరిగింది. తరువాత భవన నిర్మాణం అటకెక్కింది. నిర్మాణ వ్యయం పెరగటం, కాంట్రాక్టర్ పనులు చేపట్టడానికి ముందుకు రాకపోవడంతో ఇప్పటి వరకు భవన నిర్మాణం జరగలేదు. అప్పుడు వేసిన శంకుస్థాపన శిలాఫలకం కూడా ధ్వంసం అయిపోయింది. ఇంతకు ముందు ఇక్కడ బంగ్లా ఉండేదన్న ఆనవాళ్లుగా మొండిగోడలు దర్శనమిస్తున్నాయి. క్రోసూరులో అతిథి గృహం లేకపోవటంతో ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వారు ఇబ్బందులకు గురవుతున్నారు. పక్కనే ఉన్న ఆర్‌అండ్‌బీ శాఖ డివిజనల్ ఇంజనీరింగ్ శాఖ కార్యాలయంలో ఒక చిన్న గదిలో డబుల్ కాట్ వేసి అతిథి గృహంగా వాడుతున్నారు. ప్రతి రోజు వేరే ప్రాంతాల నుంచి వచ్చే వ్యాపారులు, అధికారులు, ప్రజా ప్రతినిధులకు ఇక్కడ బస చేయటానికి అవకాశం లేకుండా పోయింది.

పల్లెల అభివృద్ధికి సీఎం చంద్రబాబు కృషి

● ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రవీణ్

పెదకూరపాడు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ప్రతి పల్లె అభివృద్ధి చెందాలనే ఆకాంక్షతో ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ తెలిపారు. గుంటూరులోని నియోజకవర్గ క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఎమ్మెల్యే ప్రవీణ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో నియోజకవర్గ అభివృద్ధికి రూ.84.10 కోట్ల నిధులతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశామన్నారు. ప్రతి కుటుంబం అభివృద్ధి ఫలాలు పొందాలన్నదే తన ఆకాంక్ష అని, కూటమి ప్రభుత్వం హామీలను నెరవేర్చటంలో అంకిత భావంతో పని చేస్తున్నామన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేసే దిశగా ముందుకు వెళ్తున్నానని, ప్రజల భాగస్వామ్యంతో.. బలమైన నాయకత్వంతో నియోజకవర్గ అభివృద్ధి కొనసాగుతుందని ఎమ్మెల్యే అన్నారు.

నివేశన స్థలం ఆక్రమించారని కలెక్టర్‌కు ఫిర్యాదు

నర్సరావుపేట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): అమరావతి నుంచి గుంటూరు వెళ్లేదారిలో విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో సర్వేనెం. 136లో 242గజాల స్థలాన్ని తన తల్లి షేక్ హజరాబీ 1984లో గ్రామానికి చెందిన విన్నకోట మాధవరావు వద్ద కొనుగోలు చేయడం జరిగిందని ఆ స్థలాన్ని మాధవరావు బంధువులు ఆక్రమించుకున్నారని గత సోమవారం నర్సరావుపేట కలెక్టర్ కార్యాలయంలో హజరాబీ కుమారుడు షేక్ కరీముల్లా ఫిర్యాదు చేశారు. కరీముల్లా తన ఫిర్యాదులో గ్రామానికి చెందిన విన్నకోట సాంబశివరావు, శ్రీనివాసరావు, గోపిలు ఆక్రమించుకుని తమ స్థలంలో కలుపుకున్నారని ఇదేమిటని అడిగితే మీకు స్థలం అమ్మిన మాధవరావును అడుక్కోండని సమాధానం చెప్పారని ఫిర్యాదులో పేర్కొన్నారు. మాధవరావు మృతి చెంది కొన్ని సంవత్సరాలు అయిందని కరిముల్లా తెలిపాడు. ఈ విషయమై స్థానిక రెవెన్యూ అధికారులకు, పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికి వారు పట్టించుకోలేదని పేర్కొన్నాడు. పిల్లల భవిష్యత్ కోసం కొనుక్కున్న స్థలాన్ని తమకు ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఉపాధి హామీ కార్మికులకు వేతన బకాయిలు చెల్లించాలి

● వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జీ రవిబాబు

క్రోసూరు, జూన్ 3(ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపాధి హామీ పథకం కార్మికులకు ఎనిమిది నెలల వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జీ రవిబాబు డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని ఉయ్యందనలో పనులు నిర్వహిస్తున్న ప్రదేశానికి వెళ్లి కార్మికుల సాధక బాధకాల గురించి ఆయన విచారించారు. గ్రామాల్లో వేతనదారుల ఆన్‌లైన్ హాజరు వేయటంలో ఆలస్యం కావటం, సర్వర్ లేనప్పుడు హాజరు పడకపోవటం వంటి సమస్యలు ఏర్పడుతున్నాయన్నారు. జనవరిలో విడుదల చేసిన జీవో అమలు చేస్తూ శ్రమశక్తి సంఘాలు ఏర్పాటు చేయటం, మేట్లతో పని చేయించటం, పారితోషికం ఇవ్వటం లాంటివి చేయాలని ఆయన కోరారు. నెలల తరబడి వేతనాలు చెల్లించక పోవటం వల్ల కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. నరేంద్రమోదీ ప్రభుత్వం ఉపాధి హామీ పథకానికి నిధులు తగ్గించినందు వల్లే ఈ పరిస్థితి ఏర్పడుతుందన్నారు. వెంటనే వేతనాలు చెల్లించటంతో పాటు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఆయనతో పాటు వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు ఏపూరి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

విత్తన డీలర్లకు, ట్రాన్స్‌పోర్టు సిబ్బందికి సూచనలు

క్రోసూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): విత్తన డీలర్లకు, ట్రాన్స్‌పోర్టు సిబ్బందికి, రైతులకు వ్యవసాయ అధికారులు పలు సూచనలు చేశారు. క్రోసూరులోని ట్రాన్స్‌పోర్టు కార్యాలయాల్లో, విత్తన దుకాణాల్లో అధికారులు మంగళవారం విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా విత్తన డీలర్లకు, ట్రాన్స్‌పోర్టు సిబ్బందికి, రైతులకు పలు సూచనలు చేశారు. విత్తన డీలర్లు తమ వద్ద ఉన్న స్టాక్‌కు సంబంధించి అన్ని ధ్రువీకరణ పత్రాలు ఉంచుకోవాలన్నారు. స్టాక్ బోర్డులను, ధరల బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. విత్తన స్టాక్ రిజిస్టర్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలన్నారు. ట్రాన్స్‌పోర్టు సిబ్బంది విత్తనాలను రవాణా చేయు సందర్భంలో అవి బుక్ చేసే కంపెనీ వద్ద సర్టిఫికెట్ ఆఫ్ రిజిస్ట్రేషన్ కాపీని తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. రవాణా కోసం తీసుకు వచ్చే వ్యక్తి ఐడెంటీని కూడా తీసు కోవాలన్నారు. విత్తన బుకింగ్ కోసం గానీ, డెలివరీ కోసం గానీ వచ్చిన వ్యక్తులు అను మానాస్పదంగా కనిపిస్తే 8331056937 నెంబరుకు కాల్ చేయాలన్నారు. మొత్తం వివరాలు ట్రాన్స్‌పోర్టు కంపెనీ రికార్డుల్లో నమోదు చేయాలన్నారు. లైసెన్స్‌డ్ డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేసి రసీదులు పొందాలన్నారు. తనిఖీల్లో క్రోసూరు ఏడీఏ వీ హనుమంతరావు, మండల వ్యవసాయ అధికారి వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

వైద్యాధికారి ద్రాక్షాయని



అవగాహన ర్యాలీలో మాట్లాడుతున్న డాక్టర్ ద్రాక్షాయని

మాచర్లటౌన్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ వైద్యాధికారి ద్రాక్షాయని అన్నారు. మంగళవారం పట్టణంలోని కోర్టు బజారు ప్రాంతంలో గల హెల్త్ సెంటర్ వద్ద మలేరియా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ద్రాక్షాయని మాట్లాడుతూ నీటి నిల్వలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దోమ తెరలను వాడాలన్నారు. ఈ కార్యక్రమంలో మలేరియా అధికారి డి.లక్ష్మయ్య, శ్రీనివాసరావు, సూపర్‌వైజర్ నాగేశ్వరరావు, ఏఎన్ఎంలు జీఏ లక్ష్మమ్మ, కే సుకన్య, ఎం నిర్మల, ఆరోగ్య కార్యకర్తలు, ఆశాలు పాల్గొన్నారు.

● రాజుపాలెం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా ఇమ్యూనేషన్ అధికారి డాక్టర్ గీతాంజలి కోరారు. మంగళవారం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో మలేరియా నివారణ మాసోత్సవ అవగాహన ర్యాలీ నిర్వహించారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

పెదకూరపాడు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటటంతో పాటు ప్లాస్టిక్ వాడకాన్ని నిరోధించాలని తెలుగు రైతు జిల్లా కార్యనిర్వాహన కార్యదర్శి పరుచూరి పూర్ణచంద్రరరావు అన్నారు. పెదకూరపాడులోని జన చైతన్య సమితి కార్యాలయంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని కాలుష్య నియంత్రణ మండలి ముద్రించిన పోస్టర్లను మంగళవారం సాయంత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జన చైతన్య సమితి ప్రతినిధి అన్నవరపు స్టాలిన్ బాబు మాట్లాడుతూ మొక్కలు నాటడంతో పాటు ప్లాస్టిక్ నిషేధం అమలుపై ప్రజల్లో అవగాహన కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో షేక్ సుభానీ, కారుణ్య బాబు, రవికుమార్, సిద్దు తదితరులు పాల్గొన్నారు.

కిశోర బాలికలు నాయకత్వ లక్షణాలు పెంపొందించు కోవాలి

● అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఎస్ మాణిక్యం

అచ్చంపేట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : కిశోర బాలికలు నాయకత్వంతో సాధికారత దశలో వచ్చే మార్పుల గురించి తెలుసుకోవాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఎస్ మాణిక్యం అన్నారు. మంగళవారం కొత్తపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో కిశోరి వికాసం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కిశోరి బాలికలకు యోగా గురించి తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో అంగన్ వాడీ కార్యకర్తలు సీహెచ్ భాగ్యలక్ష్మి, జీ ప్రభావతి, తిరుమల, సీహెచ్ గురులక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బెల్లంకొండ విద్యార్థికి జేఈఈలో 415వ ర్యాంకు



నాగ సాయినాయక్

బెల్లంకొండ, జూన్ 3(ఆంధ్రజ్యోతి): బెల్లంకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతున్న ఎస్ నాగసాయి నాయక్ జాతీయ స్థాయిలో నిర్వహించిన జేఈఈ అడ్వాన్స్ పరీక్షలో 415వ ర్యాంకు సాధించాడని ప్రిన్సిపాల్ బత్తుల ఉమాదేవి తెలిపారు. ఉత్తమ ర్యాంకు సాధించిన నాగసాయిని కళాశాల అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు. ప్రైవేట్ కళాశాలలకు దీటుగా ప్రభుత్వ కళాశాల విద్యార్థి 415వ ర్యాంకు సాధించటంపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. నాగసాయినాయక్ ఇంటర్‌లో 856 మార్కులు సాధించాడని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. చిన్నప్పటి నుంచి కష్టపడే మనస్తత్వం, బాగా చదువుకొనే విద్యార్థి అని ఆమె అన్నారు. ఎలక్ట్రానిక్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్‌లో ఆసక్తి పెంచుకున్న నాగసాయి ఐఐటీ బాంబేలో బీటెక్ పూర్తి చేయాలని తాను అనుకున్నట్లు తెలిపారు.

పార్శిల్ కార్యాయాల్లో తనిఖీ



పార్శిల్ కార్యాలయాలను తనిఖీ చేస్తున్న ఏడీఏ శ్రీకృష్ణదేవరాయలు

పిడుగురాళ్ల, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ శాఖాధికారులు మంగళవారం పట్టణంలోని అన్ని పార్శిల్ కార్యాలయాలను ఆకస్మిక తనిఖీ చేశారు. పార్శిల్ కార్యాలయాల్లో ఉన్న రికార్డులను ఏడీఏ శ్రీకృష్ణదేవరాయలు, ఏవో శ్రీనివాసరెడ్డిలు పరిశీలించారు. పార్శిల్ కార్యాలయాల్లో గల విత్తన సంచులను, మరికొన్ని పురుగుమందుల స్టాక్‌ను పరిశీలించి ఎక్కడి నుంచి ఏ దుకాణానికి, ఏ రైతుకు వెళ్తున్నాయో పార్శిల్ కార్యాలయాల యజమానులను అడిగి తెలుసుకోవడంతోపాటు రికార్డులను పరిశీలించారు.

విత్తన విక్రయ కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీ



విత్తన దుకాణాల్లో రికార్డులను పరిశీలిస్తున్న ఏవో సంధ్యారాణి

గురజాలటౌన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని విత్తన విక్రయ దుకాణాల్లో మంగళవారం ఏవో సంధ్యారాణి ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా దుకాణాల్లో రికార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు. రైతులకు నాణ్యమైన విత్తనాలను విక్రయించాలన్నారు. విత్తన కంపెనీలకు సంబంధించిన సర్టిఫికెట్లు లేకుండా విత్తనాలను విక్రయించవద్దన్నారు. నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఏవో సంధ్యారాణి హెచ్చరించారు. ఆమె వెంట సిబ్బంది ఉన్నారు.

బైకు అదుపుతప్పి ఇద్దరికి తీవ్ర గాయాలు

● చికిత్స పొందుతూ ఒకరి మృతి

మాచర్ల రూరల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): బైకు అదుపుతప్పి ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా వీరిలో ఒకరు చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందారు. వెల్దుర్తి మండలం కొత్తపుల్లారెడ్డిగూడెంకు చెందిన ఎలక నరసింహ (41), అదే గ్రామానికి చెందిన గన్నెబోయిన నాగరాజులు నాలుగు రోజుల క్రితం ద్విచక్ర వాహనంపై తెలంగాణలోని ఓ శుభకార్యానికి వెళ్లి రాత్రి 10 గంటల ప్రాంతంలో మాచర్ల పట్టణానికి చేరుకున్నారు. అక్కడి నుంచి తమ స్వగ్రామమైన కొత్తపుల్లారెడ్డిగూడెంకు వెళ్తుండగా పట్టణ శివారులోని మండాది బోడుపై గల ఫారెస్ట్ పార్క్ వద్ద బైకు అదుపుతప్పి కిందపడిపోయారు. ఈ ఘటనలో నరసింహ తలకు, నాగరాజు నుదుటికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను మాచర్ల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా ప్రాథమిక చికిత్స అనంతరం గుంటూరులోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కాగా నరసింహ చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. ఈ ఘటనపై పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధి కోసం వెళ్లిన వ్యక్తి మృతి

రెంటచింతల, జూన్ 3(ఆంధ్రజ్యోతి): ఉపాధి నిమిత్తం తెలంగాణ రాష్ట్రంలోని మహబూబ్‌నగర్ జిల్లా జడ్చెర్ల మండలం ఆవాడు గ్రామానికి వెళ్లిన కూలి మృతి చెందాడు. పాలువాయి గ్రామానికి చెందిన దేరంగుల అప్పారావు (34) నాపరాయి క్వారీలో కూలీ పనులకు వెళ్లి సమీపంలోని బావిలో నీరు తాగుతుండగా కాలు జారి పడిపోయాడు. మృతదేహం సోమవారం రాత్రి వెలికితీశారు. మంగళవారం రాత్రి పాలువాయి గ్రామానికి తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. అతడికి భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు.

వడదెబ్బకు వృద్ధుడి మృతి



చిన ఎల్లయ్య (ఫైల్‌ఫొటో)

రెంటచింతల, జూన్ 3(ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా వీస్తున్న వడగాల్పులకు తుమ్మకోట గ్రామ పంచాయతీ శివారు పరిధిలోని కొత్తగంగరాజుపల్లెకు చెందిన గుడిపల్లి చిన ఎల్లయ్య (60) మంగళవారం ఉదయం మృతి చెందాడు. ఆయనకు భార్య మరియమ్మ, నలుగురు సంతానం.. వ్యవసాయ కూలీగా జీవనం సాగిస్తూ సోమవారం పనులకెళ్లి వచ్చిన తరువాత వాంతులయ్యాయి. అనంతరం మృతి చెందాడు. మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించిన వారిలో టీడీపీకి చెందిన లింగా మాధవరావు, చినహుస్సేన్, కృష్ణయ్య, స్వామి తదితరులున్నారు.

గోహత్యలను నిషేధించాలని పోలీసులకు ఫిర్యాదు

అమరావతి, జూన్ 3(ఆంధ్రజ్యోతి): కొన్ని రోజులుగా అమరావతి మండలం నుంచి గోవులను అక్రమంగా తరలించి గోవధకు పాల్పడుతున్నట్లు విశ్వ హిందూ పరిషత్ మండలశాఖ దృష్టికి వచ్చిందని దానికి అడ్డుకట్ట వేసేందుకు రెవెన్యూ పోలీసుశాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతూ విశ్వహిందూ పరిషత్ నాయకులు మంగళవారం తహసీల్దార్ డానియేలు, ఎస్ఐ రాజశేఖర్‌కు పిర్యాదు చేశారు హిందువులు పవిత్రంగా ఆరాధించే గోమాతలపై జరుగుతున్న అమానుషాన్ని అడ్డుకోవాలని కోరుతున్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో మండలశాఖ అధ్యక్షుడు ఎం వెంకటేశ్వరరావు, మద్ది ఆనంద్, ఎం విశ్వనాథం, కే శ్రీనివాసరెడ్డి, రామనాథ్, ఏ రమేష్ తదితరులున్నారు.

పాడి గేదెలను, ఆవులను కబేళాలకు తరలిస్తే కఠిన చర్యలు

● క్రోసూరు మార్కెట్ యార్డు కార్యదర్శి కే ఈశ్వరరావు

క్రోసూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): పాడి గేదెలను, ఆవులను కబేళాలకు తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని క్రోసూరు మార్కెట్ యార్డు ప్రథమ శ్రేణి కార్యదర్శి కే ఈశ్వరరావు అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ క్రోసూరు పశువుల సంతలో మంగళ, గురువారాల్లో సంతకు పశువులను తీసుకు వచ్చే రైతులు తమ గేదెలు, ఎద్దులు, కోడె దూడలు, ఆవులను వ్యవసాయం, పాడి పరిశ్రమకు ఉపయోగించటానికి మాత్రమే లావాదేవీలు జరపాలన్నారు. ఇక్కడ జరిగే కొనుగోళ్ళు, అమ్మకాల ద్వారా ఆవులను కబేళాలకు తరలిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. అటువంటి వారిని గుర్తించేందుకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. క్రోసూరు మార్కెట్ యార్డు ఆవరణలో కూడా ఫ్లెక్సీల ద్వారాను, గోడలపై రాతల ద్వారాను, మైకుల ద్వారానే ఈ విషయం గురించి రైతులకు తెలిసే విధంగా ప్రచారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

మండల కేంద్రాలకు చేరుకున్న పాఠ్య పుస్తకాలు



హైస్కూల్లో ఉంచిన పాఠ్యపుస్తకాలు

అమరావతి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : సర్వేపల్లి రాధాకృష్ణ సమగ్రశిక్ష అభియాన్ కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో 1 నుంచి పదో తరగతి వరకు విద్యనభ్యసించే విద్యార్థులకు అందించే పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు మండల కేంద్రానికి చేరుకున్నాయి. మండలపరిధిలోని 55ప్రభుత్వ ఎయిడెడ్ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో విద్యనభ్యసించే 3,339 మంది విద్యార్థులకు 15వేల పాఠ్యపుస్తకాలు, 17,798 నోట్ పుస్తకాలు అమరావతిలోని ఎస్ఆర్‌కే హైస్కూల్‌కు వచ్చాయి. వీటిని ఈనెల 5వ తేదీ నుంచి పాఠశాలలకు పంపిస్తామని ఎంఈవో శివబాబు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పాఠశాలలు పునఃప్రారంభానికి ముందుగానే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌పుస్తకాలు పాఠశాలలకు పంపించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పుస్తకాలను మండల కేంద్రాలకు పంపించారు. వారం క్రితం పాఠ్యపుస్తకాలు రాగా మంగళవారం నోట్ పుస్తకాలు వచ్చాయి. వాటిని ఎంఈవో శివబాబు ఆధ్వర్యంలో హైస్కూల్లో భద్రపరిచారు.

విత్తనాలు అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు



విత్తన దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న ఏవో అహ్మద్

అమరావతి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) లైసెన్సు పొందిన విత్తన అమ్మకం దారులు రైతులు సాగుచేసే విత్తనాలను నిర్ణయించిన ధరలకన్నా అధికంగా అమ్మితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని మండల వ్యవసాయశాఖ అధికారి ఎస్‌కే ఎఫ్ అహ్మద్ హెచ్చరించారు. మంగళవారం అమరావతిలోని విత్తన విక్రయ కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించి విత్తనాల స్టాక్, ధరల పట్టికను పరిశీలించారు. రైతులు విత్తనాలను లైసెన్స్ పొందిన డీలర్ వద్దనే కొనుగోలు చేసి బిల్లును తీసుకోవాలని కోరారు. డీలర్లు రైతులకు ఇచ్చే రశీదులో లాట్ నెంబరు, వెరైటీ, క్వాంటిటీని నమోదు చేయాలన్నారు.

లైసెన్స్‌డ్ డీలర్ల వద్దే విత్తనాలు కొనుగోలు చేయాలి

● ఏవో పాపకుమారి



దాచేపల్లిలో విత్తనాల దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న ఏవో పాపకుమారి

దాచేపల్లి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): రైతులు లైసెన్స్‌డ్ డీలర్ల వద్దే విత్తనాలను కొనుగోలు చేయాలని, విత్తనాలను కొనుగోలు చేసిన రైతులు బిల్లులు కూడా తీసుకోవాలని దాచేపల్లి ఏవో పాపకుమారి కోరారు. మంగళవారం దాచేపల్లి మండలంలోని గ్రంధి, రవి, నవత, పల్నాడు ట్రాన్స్‌పోర్టు కార్యాలయాల్లో తనిఖీ నిర్వహించారు. అనుమతులు లేని విత్తనాల నిల్వలపై ఆమె తనిఖీలు నిర్వహించారు. మండలంలోని విత్తనాలు విక్రయిస్తున్న దుకాణాల్లో సరుకు నిల్వలు, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. రైతులు బిల్లులు లేకుండా లూజు విత్తనాలు కొనవద్దని వివరించారు.

బిల్లు లేకుండా విత్తన నిల్వలు వస్తే సమాచారం ఇవ్వాలి

● ఇన్‌చార్జ్ ఏడీఏ శ్రీధర్‌రెడ్డి



విత్తన దుకాణాలను తనిఖీ చేస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

సత్తెనపల్లి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : డీలర్ పేరు మీద బిల్లు లేకుండా ఎటువంటి విత్తనాలు నిల్వలు వచ్చినా వ్యవసాయ శాఖకు సమాచారం అందించాలని ట్రాన్స్‌పోర్టు కార్యాలయ నిర్వాహకులకు ఇన్‌చార్జ్ ఏడీఏ శ్రీధర్‌రెడ్డి సూచించారు. పట్టణంలోని పలు విత్తన దుకాణాలను, ట్రాన్స్ ఫోర్టు కార్యాలయాలను ఇన్‌చార్జ్ ఏడీఏ ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, అధికారులు తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ పట్టణంలోని విత్తన దుకాణ దారులు తప్పనిసరిగా విత్తన ధరల పట్టిక, రోజువారి విత్తన నిల్వల వివరాలు షాపు వద్ద ప్రదర్శించాలన్నారు. డీలర్లు కూడా అధీకృత కంపెనీ నుంచే విత్తనాలు కొనుగోలు చేయాలని ఆయన సూచించారు.

ఆరోగ్య సూత్రాలను ప్రచారం చేసే బాధ్యత ఆశావర్కర్లదే

● వైద్యాధికారి పెద సైదులు

దుర్గి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యవంతమైన జీవనానికి వైద్యులు చెప్పిన ఆరోగ్య సూత్రాలను పాటిస్తూ ప్రచారం చేయాల్సిన బాధ్యత ఆశావర్కర్లపై ఉందని వైద్యాధికారి పెద సైదులు అన్నారు. స్థానిక పీహెచ్‌సీలో మంగళవారం ఆశాడే కార్యక్రమంలో భాగంగా ఆయన ఆశావర్కర్లతో సమావేశమమై పలు సూచనలు చేశారు. ప్రభుత్వానికి, సమాజానికి ఆశావర్కర్లు వారధులుగా ఉండాలన్నారు. జూన్‌లో మలేరియా మాసోత్సవాలు జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోందన్నారు. దోమల నివారణకు ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు.

● నాణ్యత, రుచిలో తగ్గేదే లేదు
● తెలుగు రాష్ట్రాలతో పాటు విదేశాలకు ఎగుమతి

ఆవకాయకు కేరాఫ్ పెదపులివర్రు

● జీవనోపాధిగా మొదలై..ఎంతో మందికి నేడు ఉపాధి
● రాణిస్తున్న మల్లిపెద్ది విజయలక్ష్మి


సిద్ధం చేసిన ఆవకాయ పచ్చడి


మామిడికాయలను ముక్కలుగా కోస్తున్న మహిళలు

రేపల్లె, జూన్ 3(ఆంధ్రజ్యోతి): ఆవకాయ పచ్చడి లేని తెలుగువారి ఇల్లు ఉండదు. ఆవకా య లేకుండా భోజనం పూర్తి చేయని వారు ఉండరు. వేసవి వచ్చిందంటే ఊరగాయలు, ముఖ్యంగా ఆవకాయ ప్రతి వం టింటిలో ఉండాల్సిందే. బాపట్ల జిల్లా భట్టిప్రోలు మండలంలోని పెదపులివర్రు గ్రామం ఓ మారుమూల ఉన్నప్పటికీ.. ఊరగాయ పచ్చళ్లకు పెట్టింది పేరు. తెలుగు రాష్ట్రాల్లో ఏదో ఒక మూల ఊరగాయల ప్రస్తావన వస్తే.. అందులో ముందుగా వినిపించే పేరు..పెదపులివర్రు. ఈ ఊరిలో ప్రత్యేకంగా చెప్పుకోవాల్సింది మల్లిపెద్ది విజయలక్ష్మి. తొలి రోజుల్లో చిన్నపాటి ఊరగాయ పచ్చళ్ల తయారీతో.. కుటుంబానికి తోడ్పాటునందించిన విజయలక్ష్మి నేడు పది కుటుంబాలకు పైగా ఉపాధిని కల్పిస్తూ.. పచ్చళ్ల వ్యాపారంలో రాణిస్తున్నారు.. జిల్లా ఖాదీ గ్రామీణ ఉద్యోగ సంస్థ 18 ఏళ్ల క్రితం అందించిన ఆర్థిక సాయమే.. తన ఈ స్థితికి కారణమని విజయలక్ష్మి అంటారు. ఆనాడు సంస్థ ఆర్థిక సాయంతో.. పచ్చళ్లు తయారు చేస్తూ ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగులకు, చుట్టుపక్కల గ్రామాల గృహస్తులకు ఊరగాయలను ఆమె విక్రయిస్తూ ఉండేవారు. ఈ నేపథ్యంలోనే అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు మహిళల, స్వయం సహాయక సంఘాలు, కుటీర పరిశ్రమలు తయారు చేసిన వివిధ రకాల వస్తువులు, తినుబండారాల ఎగ్జిబిషన్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేయించారు. అందులో విజయలక్ష్మి పచ్చళ్ల స్టాల్ కూడా ఉంది. అక్కడకు వచ్చిన ప్రజాప్రతినిధులు, అధికారులు పచ్చళ్ల రుచి చూసి ఎంతో మధురంగా ఉన్నాయని అభినందించారు. దీంతో పాటు హైదరాబాద్ ఎర్రగడ్డ రైతు బజార్‌లో పచ్చళ్ల విక్రయాలకు ఒక స్టాల్‌ను కేటాయించారు. అప్పటి నుండి విజయలక్ష్మి పచ్చళ్ల వ్యాపారం అభివృద్ధి చెందుతూ వస్తోంది. నాటి నుండి ఈనాటి వరకు కూడా అదే క్వాలిటీ మెయింటేన్ చేస్తూ వస్తున్నారు. అన్ని పదార్థాలు సమపాళ్లలో.. సాంప్రదాయ పద్ధతిలో ఆవకాయ తయారు చేయడం జరుగుతుందని విజయలక్ష్మి చెబుతారు. ప్రతి పదార్థం నాణ్యమైనదే వినియోగించడం ద్వారా ఎక్కువ కాలం పచ్చళ్లు నిల్వ ఉండి, తాజాగా ఉంటాయని అంటున్నారు. ఆవకాయ, మాగాయి, చింతకాయ, గోంగూర, టమోటా, పండుమిర్చి, అల్లం, ఉసిరి పచ్చళ్లతో పాటు వివిధ రకాల కారం పొడులు తయారు తయారు చేస్తుంటారు. వీటిని తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, తమిళనాడు, విదేశాలకు ఎగుమతులు చేస్తున్నట్లు విజయలక్ష్మి తెలిపారు.


మామిడికాయ ముక్కలలో కారం, ఉప్పు కలుపుతున్న మల్లిపెద్ది విజయలక్ష్మి


మాగాయపచ్చడికి సిద్ధం చేసిన మామిడిముక్కలు

ట్రేడర్ల ఉచ్చులో బర్లీ రైతు!

(5వ పేజీ తరువాయి)

అమలు చేయడం లేదని రైతులు వాపోతున్నారు. ధర విషయంలో కంపెనీలు న్యాయం చేస్తాయనే ఆశ తమకు చచ్చిపోయిందని అందుకే ప్రైవేట్ ట్రేడర్స్‌కు అయినకాడికి


పర్చూరు మండలం ఉప్పుటూరులో నిల్వ ఉంచిన పొగాకు

అమ్ముకుంటు న్నామని రైతులు చెబుతున్నారు. నిజానికి ట్రేడర్స్ కొనే ఈ పొగాకు కూడా అంతిమంగా పొగాకు కంపెనీల వద్దకు చేర్చవల్సిందే. ప్రభుత్వం వైపు నుంచి కంపెనీలపై ఒత్తిడి పెరుగుతున్న నేపథ్యంలో సాధ్యమైనంత పొగాకు నిల్వలను ముందు గ్రామాల నుంచి ఖాళీ చేయించే ఎత్తుగడలో భాగంగానే పెద్ద ఎత్తున ట్రేడర్స్‌ను కంపెనీలే రంగ ప్రవేశం చేయించాయన్న ఆరోపణ కూడా రైతులు చేస్తున్నారు.

కనిపించని పర్యవేక్షణ

మరో వైపు కంపెనీలు జరిపే పొగాకు కొనుగోళ్లలో పర్యవేక్షణ చేయాల్సిన బాధ్యత వ్యవసాయశాఖతో పాటు మార్క్‌ఫెడ్‌దేనని ప్రభుత్వం తెలిపింది. ధరల అమలుతో పాటు రోజువారీ కొనుగోళ్లకు సంబంధించి నివేదికలను కూడా ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి చేరవేయాలనే ఆదేశాలను కూడా జారీ చేసింది. కానీ క్షేత్రస్థాయిలో పొగాకు కొనుగోళ్లను మానిటర్ చేసే వ్యవస్థల జాడే కరువైంది. ప్రభుత్వం ఆశించిన స్థాయిలో కంపెనీలు బర్లీ పొగాకును కంపెనీలు కొనడం లేదని నిర్ణయానికి వచ్చిన పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు మంగళవారం వ్యవసాయశాఖ ప్రత్యేక కార్యదర్శి రాజశేఖర్‌ను కలిసి పరిస్థితిని వివరించారు. ఈ నెల రెండోవారం నుంచి మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దింపి పొగాకు కొనుగోళ్లను జరపడానికి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.

తీసికట్టుగానే కొనుగోళ్లు...

బాపట్ల, పల్నాడు, ప్రకాశం, గుంటూరు జిల్లాల పరిధిలో దాదాపు 5.10 లక్షల క్వింటాళ్ల పొగాకు నిల్వలు ఉన్నట్లు రెండు వారాల క్రితం ప్రభుత్వం గుర్తించింది. ఇందులో బాపట్ల జిల్లా వాటానే 3.88 క్వింటాళ్లుగా ఉంది. వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు మే 24న మార్టూరులో పొగాకు కంపెనీలతో నిర్వహించిన సమీక్షలో చివరి ఆకు వరకు కొనాలనే ఆదేశాలను జారీ చేశారు. ఈ పది రోజుల వ్యవధిలో జీపీఐ కంపెనీ 2,500 మెట్రిక్ టన్నుల బర్లీని రైతుల వద్ద కొనుగోలు చేయగా, ఐటీసీ 600 టన్నులను కొనుగోలు చేసింది. కార్డెల్ టుబాకోస్ 1,900 టన్నులను కొనుగోలు చేయగా, మహమ్మద్ ఎంటర్‌ప్రైజెస్ 865 టన్నులు బర్లీ పొగాకును కొనుగోలు చేసింది. దాదాపు 15 కంపెనీల జాడే క్షేత్రస్థాయిలో కనబడడం లేదు. రూ.6 వేలు, రూ.12 వేలు ధర చెల్లించాలనే ప్రభుత్వ ఆదేశాలను కంపెనీలు బేఖాతరు చేస్తూ సగటున రూ.8 వేలు చెల్లించే విధంగా రైతులతో బేరసారాలకు దిగారు. పైగా గ్రేడింగ్ పేరిట రైతులను ఇబ్బంది పెట్టవద్దనే ఆదేశాలు కూడా అమలుకు నోచుకోలేదు. ఇదే అదనుగా పెద్ద ఎత్తున ట్రేడర్స్ రంగంలోకి దిగి తీసికట్టు ధరలకు పొగాకు కొనుగోలు చేస్తూ రైతులను వంచించే కార్యక్రమానికి దిగారు.

రంగంలోకి మార్క్‌ఫెడ్

బర్లీ పొగాకు కొనుగోళ్ల విషయంలో కంపెనీల మీద వదిలేస్తే రైతులకు న్యాయం జరగదనే అభిప్రాయానికి ప్రభుత్వం వచ్చినట్లు సమాచారం. ఈ నెల రెండో వారంలో మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దింపి పూర్తి స్థాయిలో కొనుగోళ్లు జరిపేలా కార్యాచరణను రూపొందిస్తోంది. దీనికి సంబంధించిన విధివిధానాలపై నేడో, రేపో మార్క్‌ఫెడ్ జిల్లా విభాగానికి ఆదేశాలు రానున్నాయి. మరో వైపు క్షేత్రస్థాయిలో ట్రేడర్స్ కదలికలపై కూడా ప్రభుత్వం దృష్టిపెట్టినట్లు తెలుస్తోంది. పదేపదే మొత్తుకున్నా పట్టించుకోకుండా అరకొర కొనుగోళ్లు జరిపి మమ అనిపిద్దామన్న కంపెనీల వైఖరిని కూడా నిశితంగా గమనిస్తోంది. ముఖ్యంగా బర్లీ సాగు చేసేలా రైతులను పెద్ద సంఖ్యలో పురిగొల్పి ఇప్పుడు ముఖం చాటేస్తున్న కంపెనీల వైఖరిని కూడా ప్రభుత్వం తీవ్రంగానే పరిగణించనున్నట్లు సమాచారం. పొగాకు కొనుగోళ్లపై కంపెనీల వైఖరిని తప్పుబడుతూ గురువారం గుంటూరులోని జీపీఐ కంపెనీ ముందు రైతు సంఘాలు నిరసన కార్యక్రమానికి పిలుపివ్వడం వంటి వన్నీ కూడా సమస్య తీవ్రతకు అద్దం పట్టేలా ఉన్నాయి.

వీసీకి రిజిస్ట్రార్.. క్లీన్‌చిట్

వీసీపై ఆరోపణలు.. రిజిస్ట్రార్ విచారణ

ఎన్జీ రంగా వర్సిటీలో వెలుగు చూస్తోన్న విచిత్రాలు

గుంటూరు సిటీ, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్(వీసీ) పెద్ద. ఆరోపణల వచ్చిన నేపథ్యంలో అటువంటి వారిపై విచారణ జరపాలంటే అంతకంటే పెద్దస్థాయి అధికారికి బాధ్యతలు అప్పగించాలి. అయితే ఆచార్య ఎన్జీరంగా యూనివర్సిటీలో మాత్రం అలా జరగలేదు. వీసీపై ఆరోపణలు వస్తే ఆయనకంటే దిగువస్థాయి అధికారితో విచారణ జరిపించి క్లీన్‌చిట్ ఇప్పించిన వైనం తాజాగా వెలుగుచూసింది. విచారణను తూతూ మంత్రంగా ముగించిన వ్యవహారంపై వర్సిటీలోని అధికారులే పెదవి విరుస్తున్నారు. వీసీ అదుపు ఆజ్ఞలో ఉండే రిజిస్ట్రార్‌ను విచారణ అధికారిగా నియమిస్తూ వ్యవసాయ శాఖ ఉన్నత అధికారులు తీసుకున్న నిర్ణయంపై జోకులు వేసుకుంటున్నారు. ఒకప్పుడు హరిత విప్లవానికి బాటలు వేసి.. నూతన పరిశోధనలతో వ్యవసాయ రంగాన్ని కొత్త పుంతలు తొక్కించిన గుంటూరు లాం ఫాంలోని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వైసీపీ హయాంలో గాడితప్పింది. అవినీతి, అక్రమాలకు ఆనవాలుగా మారింది. దానిపై జనవరి 24న 'ఆంధ్రజ్యోతి' మెయిన్‌లో 'రంగా వర్సిటీకి అవినీతి రంగు 'అనే శీర్షికన ప్రచురితమైన కథనంపై స్పందించిన వ్యవసాయ మంత్రి కార్యాలయం విచారణకు ఆదేశించింది. దీంతో విచారణకు ఐఏఎస్ అధికా రిని నియమిస్తారని అందరూ భావించారు. కానీ వీసీపై వచ్చిన ఆరోపణలు నిజమో.. కాదో తేల్చాలని యూనివర్సిటీ రిజిస్ట్రార్‌ను వ్యవసాయశాఖాధి కారులు ఆదేశించారు. అయితే గతంలో చేపట్టిన విచారణ బృందం సుమారు 30 మందికి ఉద్యోగోన్నతులు, కొత్తగా ఉద్యోగాలు ఇచ్చే పేరుతో నగదు వసూళ్ళు, వర్సిటీ ఖాతా ల నిర్వహణ, మత ప్రచారం వంటి అంశాలన్నీ నిజమే అని తేల్చింది. అయితే వర్సిటీ రిజిస్ట్రార్ ఇచ్చిన నివేదిక లో మాత్రం అన్నీ సక్రమంగానే జరిగినట్లు వీసీకి క్లీన్‌చిట్ ఇస్తూ ప్రభుత్వానికి నివేదిక పంపినట్లు సమాచారం.



ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం



ద్విచక్ర వాహనాల నంబర్ ప్లేట్లపై రాసిన రాతలు

ప్లేట్ ఫిరాయిస్తున్నారు..!

- కనిపించని హై సెక్యూరిటీ రిజిస్ట్రేషన్ ప్లేట్లు
- అస్పష్టంగా వాహన ప్లేట్లపై నంబర్లు
- నేతలు, హీరోల చిత్రాలతో హడావిడి
- పట్టించుకోని రవాణా అధికారులు

గుంటూరు(తూర్పు), జూన్ 3(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం కొంత మంది వాహనదారులు ట్రెండ్ సెట్ చేస్తున్నామనుకుంటూనే ప్రమాదాన్ని కొని తెచ్చుకుంటున్నారు. కార్లు, బైక్‌లకు నంబరు ప్లేట్లు లేకుండా ఇష్టానుసారంగా రోడ్లపై తిరుగుతున్నారు. మైనర్లు సైతం అధిక సీసీ ఉన్న బైక్‌లపై స్నేక్ రేస్ అంటూ వేగంగా దూసుకెళుతున్నారు. అనుకోని ప్రమాదం జరిగితే నష్టం ఊహకు అందడం లేదు. బైక్‌లపై ఫీట్లు ఇతర ప్రమాదాలు జరిగినప్పుడు వారిని గుర్తించేందుకు వెహికల్ నంబరు ప్లేట్లు స్పష్టంగా ఉండాలి. ఆ బైక్‌ల నంబర్లను గుర్తించేందుకు వీలులేకుండా రకరకాల పేర్లతో ప్లేట్లపై ఇష్టారాజ్యంగా రాసేస్తున్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు బాధితులను గుర్తించే సమయంలో నంబర్ ప్లేట్ కీలకం. ప్రమాదాల బారిన పడినప్పుడు అస్పష్టంగా, నంబరు లేని ప్లేట్లతో.. బాధితులను గుర్తించడం అధికారులకు తలనొప్పిగా మారుతుంది.

● ఇష్టారాజ్యంగా వాహనాల నంబరు ప్లేట్లపై రాతలు

షోరూంల్లో వాహనాలను కొన్నవారు తప్పనిసరిగా 2017 నుంచి ప్రభుత్వం అందించే హైసెక్యూరిటీ రిజిస్ట్రేషన్ ప్లేట్లు మాత్రమే ఏర్పాటు చేసుకోవాలనే నిబంధన అమలులోకి వచ్చింది. కానీ, నంబరు ప్లేట్లు, నంబరు లేని లేదా చిన్నగా, గజిబిజిగా అస్పష్టంగా ఉన్న నంబర్లతో వాహనదారులు రోడ్లపై దూసుకుపోతున్నారు. కొందరు వాహనదారులు ఏకంగా సినీ హీరోలు, రాజకీయ నాయకుల ఫొటోలు ఇతరత్రా చిత్రాలతో తిరుగుతున్నారు. ఇంకొంత మంది అయితే.. ఎమ్మెల్యే, ఎంపీ, సీఎం తాలూకా, వారి కంపెనీల పేరు అంటూ నంబరు బదులు రాసుకుంటూ.. మనల్ని ఎవడ్రా ఆపేదీ.. అంటూ అధికా రులకే సవాల్ విసురుతున్నారు. అయినా సంబంధిత అధికారులు చూడనట్లుగా వదిలేస్తున్నారు.

హై సెక్యూరిటీ రిజిస్ట్రేషన్ ప్లేట్లు తప్పనిసరి

సెంట్రల్ మోటార్ వెహికల్ రూల్స్ ప్రకారం వాహనాలపై రిజిస్ట్రేషన్ మార్కు ప్రదర్శించేలా అన్ని మోటారు వాహనాల ముందు, వెనుక భాగాల్లో హైసెక్యూరిటీ రిజిస్ట్రేషన్ ప్లేట్ (హెచ్ఎస్ఆర్పీ) రూపంలో స్పష్టంగా ఉండాలి. అవసరమైన చోట వాహనం ఎడమ చేతి వైపు ముందు గ్లాసుపై క్రోమియం ఆధారిత హోలోగ్రామ్ స్టిక్కర్ ఉండాలి. ప్రతి నంబరుకు మరో నంబరు మధ్య చిన్నపాటి గ్యాప్ ఉండాలి. తెలుపు రంగులో ప్లేటుపై నల్లని అక్షరాలు మాత్రమే ఉండాలి. కాకపోతే కొంతమంది వాహన యజమానులు ఈహెచ్ఎఆర్పీని వాహనానికి అమర్చడం లేదని డీలర్లు చెబుతుంటారు.

● ప్రత్యేక డ్రైవ్



వాహనాల నంబరు ప్లేట్లపై దృష్టి సారించాం. ప్రత్యేక డ్రైవ్ ద్వారా నిబంధనలు పాటించని ప్లేట్లను అక్కడికక్కడే తొలగిస్తాం. నంబరు ప్లేటుపై.. ఇష్టానుసారం పిచ్చి రాతలు రాస్తే రూ.2 వేలు వరకు జరిమానా విధిస్తాం. అవసరమైతే వాహనాన్ని కూడా జప్తు చేస్తాం.

-ఆర్టీవో, సత్యనారాయణ వరప్రసాద్, గుంటూరు



❖ ఎన్టీఆర్ జిల్లా ముక్త్యాల- పల్నాడు జిల్లా మాదిపాడు మధ్య నిర్మాణం
❖ రూ.60.54 కోట్ల వ్యయంతో నెల రోజుల కిందట పనులు ప్రారంభం
❖ 13 పిల్లర్లతో 14.8 మీటర్ల వెడల్పుతో నిర్మాణం కానున్న బ్రిడ్జి

కృష్ణానదిపై.. బ్రిడ్జి!

(ఆంధ్రజ్యోతి, జగ్గయ్యపేట రూరల్): పవిత్ర కృష్ణానది ఉత్తర వాహిని క్షేత్రం ముక్త్యాల నుంచి కృష్ణానదిపై పల్నాడు జిల్లా మాదిపాడు వరకు కృష్ణాబ్రిడ్జి నిర్మాణ పనులు నెల రోజుల కిందట ప్రారంభమయ్యాయి. రూ.60.54 కోట్ల వ్యయంతో నిర్మించే ఈ వంతెనతో ముక్త్యాల ముఖచిత్రం మారనుంది. ఈ బ్రిడ్జి భవిష్యత్తులో పర్యాటకంగా, ఆధ్యాత్మికంగా ముక్త్యాలకు మణిహారం కానుంది. పల్నాడు జిల్లా వైపు ఇప్పటికే రెండు పిల్లర్ల నిర్మాణం జరుగుతుండగా మూడవ పిల్లర్‌కు బేస్‌మెంట్ సిద్ధం చేస్తున్నారు. మొత్తం 13 పిల్లర్లతో 14.8 మీటర్ల వెడల్పుతో బ్రిడ్జి నిర్మిస్తున్నారు. పల్నాడు జిల్లాలో 6.5 మీటర్లు, ఎన్టీఆర్ జిల్లాలో రెండు కిలోమీటర్ల మేర అప్రోచ్ రోడ్లు ఏర్పాటు చేస్తున్నారు. జిల్లాలో ఏర్పాటు చేసే అప్రోచ్ రోడ్డును జగ్గయ్యపేట-ముక్త్యాల రోడ్డుకు అనుసంధానం చేస్తున్నారు. 18 నెలల్లో పూర్తి చేసేందుకు కాంట్రాక్టు సంస్థ అన్ని హంగులతో రంగంలోకి దిగింది. వర్షాకాలం ముందుగా రావటం వల్ల పనులకు ప్రతిబంధకం కావచ్చని భావిస్తున్నారు. ప్రస్తుతం నదిలో 15 మీటర్ల లోతులో నీరు ఉందని అంచనా వేస్తున్నారు. పల్నాడు జిల్లా వైపు పూర్తైతే ఎగువ నుంచి వచ్చే నీరు ఆ వైపునకు మళ్లించి పిల్లర్‌లు నిర్మించాల్సి ఉంది.

దశాబ్దాల క్రితమే ప్రతిపాదన

ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల మధ్య దశాబ్దాల క్రితం వంతెన నిర్మించాలని ముక్త్యాల రాజా ప్రసాద్ ప్రతిపాదనలు పంపినా కార్యరూపం దాల్చలేదు. నది వెడల్పు ఎక్కువగా, లోతుగా ఉండటంతో అప్పటి పరిస్థితుల దృష్ట్యా అంత ధనం వెచ్చించి నిర్మించాల్సిన అవసరం లేదని భావించిన ప్రభుత్వం ప్రతిపాదనలను పక్కన పెట్టింది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలు చేసి, నిర్మాణానికి శంకుస్థాపన చేసింది. నిర్మాణ పనులు ప్రారంభించకముందే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో ఏడాది తర్వాత మరలా నిర్మాణానికి ప్రభుత్వం అనుమతు లివ్వటంతో పనులు ప్రారంభమయ్యాయి. రాష్ట్రానికి గేట్ వేగా ఉన్న ప్రాంతాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం పలు ప్రతిపాదనలు చేస్తున్న నేపథ్యంలో ముక్త్యాల వద్ద బ్రిడ్జి నిర్మాణానికి నోచుకుంది. తెలంగాణ, ఆంధ్ర నుంచి తమిళనాడుతో పాటు తిరుపతి వంటి సుదూర ప్రాంతాలకు వెళ్లేందుకు దగ్గర మార్గంగా మారనుంది. ఇప్పటికే ముక్త్యాల కృష్ణానది ఉత్తర వాహిని క్షేత్రంగా పలు ఆలయాలు ఉన్నాయి. ఈ ప్రాంతంలో సిమెంట్ కర్మాగారాలున్నాయి. దీంతో ముక్త్యాలకు భవిష్యత్‌లో ఈ వంతెన మణిహారంగా మారుతుందని భావిస్తున్నారు.


పల్నాడు జిల్లా వైపు నిర్మిస్తున్న పిల్లర్

ఆధార్ నవీకరణకు అగచాట్లు!

(5వ పేజీ తరువాయి)

మూసి వేశారు. వేలాది మంది చిన్నారుల ఆధార్ నవీకరించాల్సి ఉంది.

ప్రభుత్వ సంక్షేమ పథకాలు

రాష్ట్ర ప్రభుత్వం తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం వంటి పథకాలు అమలు చేసేందుకు సిద్ధమవుతోంది. ఈ తరుణంలో ఆధార్ నవీకరణ లబ్ధిదారులకు చుక్కలు చూపిస్తోంది. వేలిముద్రలు, చిరునామా, వ్యక్తిగత చిత్రం, మొబైల్ నంబరు, ఇతర దోషాల సవరణకు ప్రైవేట్ ఆధార్ కేంద్రాల వద్ద తీవ్ర ఇక్కట్లు ప డుతున్నారు. కొత్తగా పెళ్లి అయినవారు కొత్త రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఆధార్‌లో చిరునామా మార్చుకోవాలి.

పిల్లల ఆధార్ నవీకరణ తప్పనిసరి..

పిల్లలకు ఆధార్ నవీకరణ తప్పనిసరి. ఆధార్ తీసుకున్న 15 ఏళ్లలోపు వారి వేలి ముద్రలను నవీకరించుకోవాలి. 16 నుంచి 18 ఏళ్ల మధ్యలో వేలి ముద్రలు, కనుపాపల పునర్స్వీరణ తప్పనిసరి. ఇలా చేసుకుంటేనే విద్యార్థులకు వివిధ పరీక్షలకు ఇబ్బందులు తలెత్తకుండా ఉంటాయి. తగిన ధ్రువ పత్రాలను అప్‌లోడ్ చేస్తేనే నవీకరణ ప్రక్రియ సజావుగా సాగుతుంది. గతంలో సబంధిత పత్రాల నమోదు కాకపోవడం ఇతర సాంకేతిక కారణాలతో చాలా వరకు తిరస్కరణకు గురయ్యాయి.

నవీకరణకు అధిక వసూళ్లు..

గతంలో ఆధార్ నవీకరణ కోసం ప్రభుత్వం ప్రత్యేక శిబిరాలను నిర్వహించింది. ఇటువంటి పరిస్థితి ప్రస్తుతం లేదు. దీంతో ఆధార్‌లో మార్పులు చేసేందుకు కొన్ని ప్రైవేటు కేంద్రాల్లో రూ.500 నుంచి రూ.700 వరకు వసూలు చేస్తున్నట్లు లబ్ధిదారులు చెబుతున్నారు. వీటిపై అధికారులు పర్యవేక్షణలేదు. ఇప్పటికైనా అధికారులు ఆధార్ నవీకరణ కోసం ప్రత్యేక శిబిరాలను నిర్వహించాలని బాధితులు కోరుతున్నారు. నవీకరణ కాకపోతే పథకాలను కోల్పోతామన్న ఆందోళన సర్వత్రా నెలకొంది.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి: కలెక్టర్

నరసరావుపేట రూరల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): నూజెండ్ల, వినుకొండలలో మంగళవారం రవాణా శాఖ, పోలీస్ శాఖలు ఉమ్మడిగా తనిఖీలు నిర్వహించారు. మే 20న కలెక్టర్ ఆధ్వర్యంలో జరిగిన జిల్లా రోడ్డు భద్రత కమిటీ సమావేశంలో ఇచ్చిన కలెక్టర్ ఆదేశాల మేరకు రవాణా శాఖ, పోలీస్ శాఖలు ఉమ్మడిగా ఆటో రిక్షాలపై తనిఖీలు నిర్వహించి 18 వాహనాలపై కేసు నమోదుచేశారు. అందులో 8 వాహనాలను సీజ్ చేశారు. రూ.1,12,310 అపరాధ రుసుం విధించారు. తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని దీనివల్ల రోడ్లపై జరిగే ప్రమాదాలను నిర్మూలించవచ్చని జిల్లా రవాణా శాఖ అధికారి జి.సంజీవ్ కుమార్ తెలిపారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

జనాభా నిర్వహణపై క్యూఆర్ కోడ్ పోస్టర్ విడుదల

నరసరావుపేట కల్చరల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): జనాభా నిర్వహణ విధానంపై ప్రజల అభిప్రాయాల సేకరణకు సంబంధించి క్యూ ఆర్ కోడ్ పోస్టర్‌ను మంగళవారం జిల్లా కలెక్టర్ విడుదల చేశారు. ఈ నెల 1 నుంచి 25 వరకు క్యూ ఆర్ కోడ్ ద్వారా ప్రజల అభిప్రాయాలను సంబంధిత అధికారులు తమ పరిధిలోని కుటుంబాల నుంచి సేకరిస్తారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే, ఇతర గణాంక శాఖ అధికారులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

చిలకలూరిపేట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట పట్టణంలోని పలు ప్రాంతాలలో బుధవారం లైన్ల మరమ్మతులు, చెట్లు కొట్టే పనుల నిమిత్తం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని విద్యుత్ శాఖ డీఈఈ ఆర్ అశోక్ కుమార్ మంగళవారం తెలిపారు.

క్షయ వ్యాధిపై అవగాహన ర్యాలీ

శావల్యాపురం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): క్షయవ్యాధి నివారణకు ముందస్తు జాగ్రత్తలు పాటించాలని పీహెచ్‌సీ వైద్యాధికారి రావిపూడి రమ్య అన్నారు. జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రం నుండి సెంటర్ వరకు వైద్యసిబ్బంది సోమవారం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్‌లు ఏడుకొండలు, ఉమాదేవి, ల్యాబ్ టెక్నీషియన్ సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

శివాపురం శివాలయంలో చోరీ

వినుకొండ టౌన్, జూన్-3, (ఆంధ్రజ్యోతి) మండలంలోని శివాపురం సమీపంలోని శివాలయంలో దొంగలుపడి విలువైన సామాగ్రిని దోచుకున్న సంఘటన సోమవారం రాత్రి చోటు చేసుకుంది. ప్రకారం వంటసామగ్రితో పాటు, ఇన్వర్టర్, బాటరీ, సోలార్‌లైట్లు ఇతర సామగ్రిని దొంగలు దోచుకున్నట్లు పోలీసులకు పూజారి ఉమాశంకర్ ఫిర్యాదు చేశారు.

బీమా చెక్కు అందజేత

నాదెండ్ల, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గణపవరం గ్రామానికి చెందిన జనసేన పార్టీ క్రియాశీలక సభ్యుడు గజ్జా శ్రీకాంత్ కుటుంబ సభ్యులకు రూ.5లక్షల చెక్కును అందజేశారు. ఇటీవల శ్రీకాంత్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కాగా మంగళగిరిలో జరిగిన కార్యక్రమంలో రూ.5 లక్షల ప్రమాద బీమా కింద మంజూరైన చెక్కును కుటుంబ సభ్యులకు ఎమ్మెల్సీ నాగబాబు అందజేశారు.

జేఈఈ పరీక్షల్లో ఉన్నవ విద్యార్థి ప్రతిభ

యడ్లపాడు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): యడ్లపాడు మండలం ఉన్నవ గ్రామానికి చెందిన విద్యార్థి కాకుమాను పార్థసారథి జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ప్రతిభ చూపాడు. ఓపెన్ కేటగిరీలో 565వ ర్యాంకు, ఈడబ్ల్యుఎస్ విభాగంలో 36వ ర్యాంక్ సాధించాడు. దీనిపై గ్రామస్థులు పలువురు అభినందించారు.

ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో యోగా

నరసరావుపేట కల్చరల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా మంగళవారం పల్నాడు రోడ్డులో ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆ శాఖ అధికారులు, ఉద్యోగులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ అధికారి మణికంఠ మాట్లాడుతూ యోగాంధ్రలో భాగస్వామ్యులు కావాలన్నారు. సుమారు 200మంది యోగా కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రజలు ఎన్నికల్లో బుద్ధి చెప్పినా వైసీపీ నాయకుల తీరు మారలేదు

ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు



విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, పక్కన ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సీహెచ్ రాంబట్లు తదితరులు

నరసరావుపేట టౌన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ప్రజలు ఎన్నికల్లో చెప్పుతో కొట్టినట్లు బుద్ధిచెప్పినా వైసీపీ నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి, వారి ఎమ్మెల్యేలు, నాయకుల తీరుమారలేదని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు విమర్శించారు. మంగళవారం నరసరావుపేట టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో విలేకరుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్లలో అవినీతి పనులు, దుర్మార్గాలు చేసిందన్నారు. ప్రజలను ప్రశాంతంగా బతకనీయలేదన్నారు. ప్రతిరోజు టీడీపీ, జనసేన, బీజేపీలో యాక్టివ్‌గా తిరిగే నాయకుల మీద దాడులు చేసి, అక్రమంగా కేసులు పెట్టారన్నారు. వైసీపీ వాళ్ళు పల్నాడులో చాలామందిని హత్య చేశారన్నారు. వైసీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి, ఆయన ఎమ్మెల్యేలు, నాయకులు ప్రజాస్వామ్యయుతంగా వ్యవహరించలేదన్నారు. టీడీపీ, బీజేపీ, జనసేన వాళ్లను పంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి నామినేషన్‌లు కూడా వేయనీయకుండా ఏకపక్షంగా వ్యవహరించారన్నారు. నరసరావుపేట అసెంబ్లీ సెగ్మెంట్‌లో రియల్ ఎస్టేట్ చేసేవారిపై దాడులు చేశారని, అక్రమంగా భూములు కబ్జా చేశారని, సాయి బాలాజీ సిటీలో అక్రమంగా 46 ఎకరాలు కబ్జా చేశారని, ఇదంతా వెన్నుపోటు కాదా అని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డిని ప్రశ్నించారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డికి మాట్లాడే అర్హత లేదన్నారు. ఏదో విధంగా గ్రామాలలో అలజడి సృష్టించి వైసీపీ కూటమి నాయకుల మీద దాడులు చేయడం, అశాంతిని రేకెత్తించడానికి వైసీపీ అన్ని విధాలుగా ప్రయత్నిస్తున్నారని చెప్పారు. వైసీపీ తీరుమారకుంటే 2029లో ఒక సీటుతో బుద్ధి చెబుతారని హెచ్చరించారు. మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, వైసీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి తీరుమార్చుకోవాలని కోరారు. సమావేశంలో బులియన్ మర్చంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కపలవాయి విజయకుమార్, బీజేపీ నాయకుడు రంగిశెట్టి రామకృష్ణ, అత్తులూరి వెంకట సుబ్బారావు, జనసేన చిందుకూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పట్టణ బీసీ అధ్యక్షుడిగా మడకా

నరసరావుపేట పట్టణం టీడీపీ బీసీ విభాగం అధ్యక్షుడుగా మడకా శివప్రసాదరావును ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మంగళవారం ప్రకటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబును శాలువాతో సత్కరించి మడకా శివప్రసాదరావు కృతజ్ఞతలు తెలియజేశారు.

నూతన ట్రాన్స్‌ఫార్మర్లు ప్రారంభం

నరసరావుపేట పట్టణంలో విద్యుత్ వినియోగదారులకు లోవోల్టేజ్ సమస్య తీర్చటంలో భాగంగా స్థానిక ఏనుగుల బజార్‌లో, బాపనయ్య నగర్‌లో నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశారు. మంగళవారం ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ ప్రజా వేదిక కార్యక్రమంలో వచ్చిన అర్జీల ఆధారంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లు ఒక్కొక్కటి సుమారు రూ.10 లక్షల వ్యయంతో మంజూరు చేసుకొని ప్రారంభించటం జరిగిందన్నారు. కార్యక్రమంలో నరసరావుపేట డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ప్రసాద్, అసిస్టెంట్‌ఇంజనీర్లు రవీ, సురేంద్రబాబు, విద్యుత్‌శాఖ సిబ్బంది ఆర్ బంగారయ్య, టైన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై స్పెషల్ డ్రైవ్ చేపట్టండి: కలెక్టర్

నరసరావుపేట కల్చరల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 6 నుంచి 14వరకు ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించి డ్రెయిన్లను శుభ్రపరచాలని కలెక్టర్ పి.అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్‌ఎస్ సమావేశ మందిరంలో కలెక్టర్ మండల అధికారులతో, మున్సిపల్ అధికారులతో వాతావరణంలో మార్పుల నేపథ్యంలో రానున్న రోజులలో తీసుకోవలసిన ముందస్తు చర్యలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 4వ తేదీ నుంచి 5వ తేదీలోపు ట్యాంకులను శుభ్రపరచడం, క్లోరినేషన్ ప్రక్రియలను పూర్తి చేయాలన్నారు. వెక్టార్, హైజీన్ యాప్‌లో వివరాలు త్వరితగతిన అప్లోడ్ చేయాలన్నారు. మండల పరిషత్ అధికారులు నిర్లక్ష్యం వీడి పనులు సకాలంలో పూర్తిచేయాలన్నారు. నిర్లక్ష్యం వహించిన వారిపై అవసరమైన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. మాన్‌సూన్ ఈ నెల 12 నుంచి మొదలు కానున్న నేపథ్యంలో వాతావరణంలో మార్పుల వలన వృద్ధులు, చిన్న పిల్లల్లో ఇమ్యూనిటీ తగ్గటం వలన జలుబు, దగ్గు, జ్వరం వంటివి వస్తాయని, దానిని దృష్టిలో పెట్టుకుని ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. పంచాయితీరాజ్ శాఖ ఇంజనీరింగ్ అసిస్టెంట్, పంచాయతీ కార్యదర్శి క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి అవసరమైన చోట మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. కొవిడ్ మహమ్మారి విస్తరిస్తున్న నేపథ్యంలో అనుమానం ఉన్నవారిని పరీక్షలు చేయించి తగు జాగ్రత్తలు సూచించాలన్నారు. జిల్లాలో అవసరమైన రాపిడ్ కిట్లు ఉన్నాయని, అవసరాన్ని బట్టి మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈ నెల 5న 10వేల మందితో కార్యక్రమం నిర్వహించనున్నామని, 4వ తేదీన అనుపు వద్ద సుమారు వెయ్యి మందితో యోగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. హాట్ స్పాట్‌లను గుర్తించి వ్యాధులు ప్రబలకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జేసి సూరజ్ గనోరే మాట్లాడుతూ సిటిజన్ రిజిస్ట్రేషన్ వేగవంతం చేసి, నిర్దేశిత లక్ష్యం చేరుకునేలా మండల అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డీఎంహెచ్‌వో డా.బి.వి.రవి, డీసీహెచ్‌ఎస్ డా.ప్రసూన, డీఎల్‌డీ వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల విద్యలో మార్పులపై అవగాహన



డీఎస్సీ పరీక్షా కేంద్రాలను పరిశీలిస్తున్న డీఈవో

నరసరావుపేట కల్చరల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యలో ప్రవేశపెట్టిన మార్పులను అవగాహన చేసుకోవడానికి మూడ్రోజుల శిక్షణ కార్యక్రమం దోహదపడుతుందని పల్నాడు జిల్లా విద్యాశాఖాధికారి ఎల్. చంద్రకళ అన్నారు. మంగళవారం స్థానిక మున్సిపల్ బాలికోన్నత పాఠశాలలో ఈ నెల 5వరకు మూడ్రోజుల పాటు జిల్లా రిసోర్సుపర్సన్‌కు నిర్వహిస్తున్న శిక్షణ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరం నూతనంగా ప్రవేశపెడుతున్న మూల్యాంకనం పుస్తకాలు, ఎకడమిక్ క్యాలెండర్, టీచర్ హ్యాండ్ బుక్, గ్రంథాలయ నిర్వహణ, లీప్‌యాప్, బ్రిడ్జి కోర్సుల వంటి వాటిపై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించేందుకు ఈ శిక్షణ కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్సీఈఆర్టీ పరిశీలకులు లక్ష్మీ ప్రసన్న, డీసీసీబీ చైర్మన్ కృష్ణనాయక్, డీవైఈవో సుభాని, ప్రధానోపాధ్యాయులు గోవిందరాజులు పాల్గొన్నారు. శిక్షణ కార్యక్రమంలో 130మంది రిసోర్సుపర్సన్లు పాల్గొనగా వీరికి 14మంది సబ్జెక్టు నిపుణులు శిక్షణ ఇస్తున్నారు.

డీఎస్సీ పరీక్షా కేంద్రాలను పరిశీలించిన డీఈవో

ఈ నెల 6 నుంచి డీఎస్సీ పరీక్షలు జరగనున్నందున మంగళవారం జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ పరీక్షా కేంద్రాలను సందర్శించి, ఏర్పాట్లను పరిశీలించారు. నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాల, ఎన్ఐటీ, ఏఎం రెడ్డి కళాశాల, తిరుమల ఇంజనీరింగ్ కళాశాల, ఎంఏఎం ఇంజనీరింగ్ కళాశాలలను సందర్శించారు. ఎటువంటి లోటుపాట్లు లేకుండా చర్యలు చేపట్టాని యాజమాన్యాన్ని కోరారు.

అనధికార నిల్వలు ఉంచితే చర్యలు

● వ్యవసాయశాఖ ఏడీఏ రవిబాబు

వినుకొండ టౌన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): వినుకొండ పరిధిలోని విత్తన షాపులతో పాటు, ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయాల్లో వ్యవసాయశాఖ అధికారులు మంగళవారం తనికీలు నిర్వహించారు. తనిఖీల్లో పాల్గొన్న వ్యవసాయశాఖ ఏడీఏ రవికుమార్ మాట్లాడుతూ అనధికార విత్తన ప్యాకెట్లు వచ్చిన వెంటనే సమాచారం ఇవ్వాలని తెలిపారు. అనంతరం పట్టణ పరిధిలోని విత్తన షాపుల్లో తనిఖీలు నిర్వహించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏవో వరలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

● చిలకలూరిపేట: పట్టణంలోని ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసులు, విత్తన దుకాణాలలో స్థానిక మండల వ్యవసాయాధికారి శ్రీలత మంగళవారం తనిఖీలు నిర్వహించారు. రసీదు లేకుండా విత్తనాలు కొనుగోలు చేయవద్దని, లైసెన్స్ ఉన్న దుకాణం లోనే విత్తనాలు కొనుగోలు చేయాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. అధిక ధరలకు విత్తనాలు అమ్మితే 83310 56944 నంబరుకు ఫోన్ చేసి తెలపాలని కోరారు.

● బొల్లాపల్లి: మండలంలోని రేమిడిచర్ల, రావులాపురం గ్రామాల్లోని విత్తనాల దుకాణాల్లో మండల వ్యవసాయ అధికారి అబ్బూరి అంకారావు మంగళవారం తనిఖీలు చేపట్టారు. అనధికారికంగా ఎవరైనా విత్తనాలు గ్రామాల్లో అమ్ముతుంటే మండల వ్యవసాయ అధికారి దృష్టికి తీసుకు రావాలని, 8331056966 సెల్ నెంబరుకు తెలియ జేయాలన్నారు.

జనసేన పార్టీ ఆధ్వర్యంలో నేడు వేడుకలు

వినుకొండ, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) కూటమి ప్రభుత్వ వచ్చి ఏడాది పూర్తి అవుతున్న సందర్భంగా జనసేనపార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు ఈ నెల 4 తేదీన నియోజకవర్గంలో జనసేన పార్టీ నాయకులు నాగశ్రీను ఆధ్వర్యంలో సంక్రాంతి, దీపావళి పండుగ వేడుకలు నిర్వహించనున్నట్లు నాగశ్రీను రాయల్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకులతో కలిసి వేడుకలుకు సంబధించిన గోడ ప్రతులను విడుదల చేశారు. సాయంత్రం దీపాలు వెలిగించి టపాకాయలు కాల్చి పండగ చేసుకుందామని తెలిపారు.

చారిత్రక వైభవానికి ప్రతీక కొండవీడు

● రాజ్యసభ మాజీ సభ్యుడు తులసిరెడ్డి



కొండవీడుకోటలోని వెదుళ్ళ చెరువును పరిశీలిస్తున్న తులసిరెడ్డి

యడ్లపాడు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): తెలుగువారి చారిత్రక వైభవానికి, వారసత్వ సంపదకు ప్రతీక కొండవీడుకోట అని రాజ్యసభ మాజీ సభ్యుడు డాక్టర్ తులసిరెడ్డి అన్నారు. యడ్లపాడు మండలంలోని కొండవీడుకోటను ఆయన మంగళవారం సందర్శించారు. లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని సందర్శించి పూజలు నిర్వహించారు. కొండ దిగువన కోట గ్రామ పరిధిలోని కత్తుల బావిని సందర్శించారు. ఫిరంగిపురం మండలం హౌస్‌గణేష్ పాడులోని రెడ్డిరాజుల వారసత్వ ప్రదర్శనశాలను సందర్శించారు. కార్యక్రమంలో కొండవీడుకోట అభివృద్ధి కమిటీ కన్వీనర్ కల్లి శివారెడ్డి, మ్యూజియం కన్వీనర్ బోడపాటి అంజిరెడ్డి, మేనేజర్ నారాయణరెడ్డి, కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త రాధాకృష్ణ, యడ్లపాడు, నాదెండ్ల మండలాల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు.

ఆసుపత్రి అభివృద్ధికి రూ. 9.45 కోట్లు మంజూరు

● ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట ఏరియా వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధికి రూ.9.45కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిందని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు మంగళవారం తెలిపారు. గత శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో ఆసుపత్రి అభివృద్ధి ఆవశ్యకతను, రోగుల ఇబ్బందులను ప్రభుత్వానికి తెలియచేసినట్లు చెప్పారు. మంజూరైన నిధులతో ఆసుపత్రి కాంపౌండ్ వాల్‌తో పాటు, ఆసుపత్రిలో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణం, అంబులెన్స్ షెడ్, పార్కింగ్ షెడ్, బ్లడ్ బ్యాంక్, దోబీ ఘాట్ల నిర్మాణం, పాతభవనం మరమ్మతులు, అవసరమైన వైద్యపరికరాల కొనుగోలు, జనరేటర్ ఏర్పాటు, మోడర్న్ కిచెన్ ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు.

చిన్నపిల్లల ఆసుపత్రి ఏర్పాటుకు వినతి

పట్టణం నడిబొడ్డున రిజిస్ట్రార్ ఆఫీస్ పక్కన ఉన్న పాత ప్రభుత్వ ఆసుపత్రి స్థలంలో ప్రభుత్వ చిన్నపిల్లల ఆసుపత్రి నిర్మించాలని కోరుతూ హాస్పటల్ సాధన అఖిలపక్ష కమిటీ నాయకులు మంగళవారం స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావును ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందచేశారు. గత అనేక సంవత్సరాలుగా ఈ స్థలం నిరుపయోగంగా ఉందని వారు తెలిపారు.

పెళ్ళయిన నెలకే భర్త ఆత్మహత్య

చిలకలూరిపేట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): పెళ్లయి నెల రోజుల్లోనే భర్త పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన చిలకలూరిపేట మండలం మురికిపూడిలో మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలాఉన్నాయి. మురికిపుడి గ్రామానికి చెందిన కొమ్మనబోయిన వీరాంజనేయులు (23) అదే గ్రామానికి చెందిన యువతిని పెళ్లి చేసుకున్నాడు. వివాహం జరిగి నెల రోజులు అవుతున్నా భార్య దగ్గరకు రానివ్వడం లేదని మనస్థాపం చెందాడు. ఈ విషయం ఎవరికి చెప్పుకోవాలో తెలియక తనలో తానే కుమిలిపోయాడు. జూన్ 1వ తేదీన పొలాల్లోకి వెళ్లి పురుగుమందు తాగాడు. సమాచారం తెలుసుకున్న అతడిస్నేహితులు తొలుత చిలకలూరిపేటలోని ప్రైవేట్ ఆసుపత్రికి చికిత్సకోసం తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా సోమవారం మృతి చెందాడు. మరణ వాంగ్మూలంలో తన భార్య మరొక వ్యక్తిని ప్రేమించిన కారణంగా తనతో దాంపత్య జీవితానికి ఒప్పుకోలేదని చెప్పినట్టు సమాచారం. చిలకలూరిపేట రూరల్ పోలీసులు మంగళవారం కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రేమ పేరుతో వంచన చేశారంటూ యువతి ఫిర్యాదు

నాదెండ్ల, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ప్రేమ పేరుతో తనను మోసానికి, వంచనకు గురి చేశారని, న్యాయం చేయాలంటూ పల్నాడు జిల్లా ఎస్పీకి ఓ మహిళ ఫిర్యాదు చేసింది. చదువు నిమిత్తం నాయనమ్మ ఊరిలో చదువుతున్న సమయంలో పట్టణంలోని విశ్వ భారతి జూనియర్ ఇంటర్ కళాశాల డైరెక్టర్ సోడిశెట్టి రామానాయుడు తనను ప్రేమిస్తున్నానని వెంటపడి, పెళ్ళి చేసుకుంటానని లొంగదీసుకొని గర్భవతిని చేశాడని ఆరోపించారు. అధిక కట్నం ఆశతో వేరొకరితో పెళ్ళికి సిద్ధమైన సమయంలో 2022లో నరసరావుపేట దిశ పోలీసు స్టేషన్‌లో కేసు పెట్టానన్నారు. అతని తల్లి వెంకట సుబ్బమ్మ, బంధువులు దుర్గాప్రసాదు, ఏఆర్ కానిస్టేబుల్ నరేంద్ర తన వద్దకు వచ్చి పెళ్ళి చేస్తామని నమ్మించి తీసుకు వెళ్లి అక్కడ రామానాయుడు నీ కంటే పెద్దవాడని, బెదిరించి అతనికి బదులుగా తమ్ముడైన కామేశ్వరరావుతో వివాహం చేశారన్నారు. పెళ్ళి అయిన తరువాత వెళ్ళి పోయిన కామేశ్వరరావు తిరిగి రాలేదన్నారు. తనను మోసగించిన రామా నాయుడు వాట్సప్‌లలో అసభ్యకరంగా మెసేజ్‌లు పెట్టాడని వివరించారు. కామేశ్వరరావుకు విడాకులు ఇవ్వాలని బంధువులు దుర్గా ప్రసాదు, నరేంద్రలు తనను బెదిరిస్తున్నారని, చంపేందుకు కూడా ప్రయత్నిస్తున్నారని, రక్షించాలని ఆమె ఫిర్యాదు చేశారు.

క్లుప్తంగా...

నరసరావుపేట టౌన్ జూన్ 3 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేటలోని ఏపీఎస్ ఆర్టీసీ డ్రైవింగ్ స్కూల్‌లో అశోక్ లేలాండ్ కంపెనీకి చెందిన ఇంజనీర్ మురళీకృష్ణ ఆధ్వర్యంలో పల్నాడు జిల్లాలోని ఆర్టీసీ డ్రైవర్లకు బీఎస్ 6 వాహనాలపై మంగళవారం అవగాహన కల్పించారు.

● నరసరావుపేట టౌన్: స్థానిక ఎస్ఎస్ఎన్ కళాశాలలో జరిగిన రాష్ట్రస్థాయి అంతర జిల్లాల స్విమ్మింగ్ పోటీలలో ఎస్ఎస్ఎన్ కళాశాల విద్యార్థి ప్రతిభ చాటారని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.సుబ్రహ్మణ్యసుధీర్ మంగళవారం తెలిపారు. పోటీలలో ఎస్ జగదీశ్ రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీలలో రెండు బంగారు పతకాలు, ఒక రజిత పతకం, ఒకటి కాంశ్య పతకం సాధించారన్నారు.

● రొంపిచర్ల: మండలంలోని రొంపిచర్ల, విప్పర్ల, మునమాక సెక్టార్ల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో కిశోర బాలికల వేసవి ప్రత్యేక శిబిరంలో భాగంగా పలు కార్యక్రమాలను మంగళవారం నిర్వహించారు. కిశోర బాలికలకు, కౌమార బాలికల నాయకత్వం, సాధికారిత గురించి అవగాహన కల్పించారు.

● రొంపిచర్ల: మండల కేంద్రమైన రొంపిచర్లలో మలేరియా మాసోత్సవ ర్యాలీ మంగళవారం జరిగింది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి చెరువు కట్ట సెంటర్ వరకు ఈ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారి జగన్ నరసింహారెడ్డి, సీహెచ్‌వో చంద్రశేఖర్, హెల్త్ సూపర్‌వైజర్ రామయ్య, హెల్త్ అసిస్టెంట్‌లు కిరణ్ కుమార్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

● రొంపిచర్ల: మండలంలోని కర్లకుంటలో ఈ నెల 5వ తేదీన ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ జరగనుంది. ఈ సందర్భంగా పూజా కార్యక్రమాలు మంగళవారం ప్రారంభమయ్యాయి.

● రొంపిచర్ల: మండలంలోని సంతగుడిపాడు, ఆరేపల్లి, చాకలికుంట తండా గ్రామాల్లో రేషన్ షాపులను జనసేన రొంపిచర్ల మండల అధ్యక్షుడు అచ్చుల సాంబశివరావు ప్రారంభించారు. రమణయ్య, కోటేశ్వరరావు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

● ఈపూరు: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ నెల 6వ తేదీన ఈపూరు ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు తహసీల్దారు నళిని తెలిపారు.


రేపు జగ్గాపురంలో శ్రీసిద్ధి గణపతి విగ్రహ ప్రతిష్ఠ

యడ్లపాడు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): యడ్లపాడు మండలం జగ్గాపురంలో పలు దేవతా విగ్రహాల ప్రతిష్టా మహోత్సవం ఘనంగా జరగనుంది. గ్రామంలోని బీసీ కాలనీ సమీపంలో సుమారు అర ఎకరం స్థలంలో నూతనంగా శ్రీసిద్ధి గణపతి ఆలయాన్ని నిర్మించారు. ఈ నెల 5న విగ్రహ ప్రతిష్టా మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు.

మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలి: ఎంఈవో

నూజెండ్ల, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజనం పథకంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఎంఈవో ఎస్.రవిచంద్ర అన్నారు. జడ్పీ పాఠశాలలో మంగళవారం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా సీసీహెచ్ నిర్వాహకులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

వైభవంగా యోగినీ గంగమ్మతల్లి బోనాలు



బోనాలతో తరలివెళుతున్న మహిళలు

ఇర్లపాడు (శావల్యాపురం) జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇర్లపాడులో నూతనంగా నిర్మించిన యోగినీ గంగమ్మతల్లి దేవాలయంలో బోనాలను భక్తులు సోమవారం వైభవంగా నిర్వహించారు. వేకువజామునే భక్తులు జలబిందెలతో నీటిని తెచ్చి అమ్మవారికి క్షీరాభిషేకాలు నిర్వహించారు.

దివ్యాంగులకు మెరుగైన విద్యనందించడమే లక్ష్యం: సెల్వరాజ్

శావల్యాపురం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించి వారికి మెరుగైన విద్యనందించడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని పల్నాడు జిల్లా ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ కో ఆర్డినేటర్ సెల్వరాజ్ అన్నారు. న్యూ ఎన్రోల్‌మెంట్ డ్రైవ్‌లో భాగంగా బడిబయటి దివ్యాంగులందరినీ పాఠశాలల్లో చేర్పాలని కోరుతూ శావల్యాపురంలో సోమవారం దివ్యాంగుల ఇంటింటికీ తిరిగి పాఠశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాలను గురించి వివరించారు. కార్యక్రమంలో ఐఈఆర్టీ రిసోర్స్‌పర్సన్‌లు జగన్మోహన్‌రెడ్డి, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో గణనీయంగా తగ్గిన కుష్ఠు వ్యాధి: దేవసాగర్

నాదెండ్ల, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కుష్ఠు వ్యాధి కేసులు గణనీయంగా తగ్గాయని వైద్య ఆరోగ్య శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ దేవసాగర్ అన్నారు. మండలంలోని గణపవరంలోని పీహెచ్‌సీని మంగళవారం ఆయన సందర్శించారు. ఆయన సిబ్బందితో మాట్లాడుతూ ప్రస్తుతం పీహెచ్‌సీ పరిధిలో మూడు కుష్ఠు, నాలుగు టీబీ కేసులు ఉన్నాయన్నారు. జిల్లాలో గతంలో 122 కేసులు ఉండేవని, ఆ సంఖ్య తగ్గి ప్రస్తుతం 57 కేసులు మాత్రమే ఉన్నాయన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి కవిత, అనసూయదేవి, డీపీఎం రమణారావు, అంజమ్మ పాల్గొన్నారు.